# గానకళ

సంగీత మాసపత్రిక

#30-1-29, రంగయ్యనాయుడు వీధి, కాకినాడ - 533 001, సెల్: 9441488721

సహాయ సంపాదకులు

**శ్రీ వాసా గోపీనాధరావు**

విశ్రాంత ప్రిన్సిపాల్, సంగీత నృత్యకళాశాల, హైదరాబాద్

**శ్రీ కె.వి.బ్రహ్మానందం,**

విజయవాడ, విశ్రాంతాచార్యులు, ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల

**శ్రీ మండలీక సీతారాఘవరావు**, చెన్నై

**శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి**, కాకినాడ


గానకళ సంచికలను
ganakala.in website
ద్వారా పొందవచ్చును.


**సంపుటి - 59,60** | **మే, జూన్, జూలై - 2022** | **సంచికలు - 10,11,12.**



**సంపాదకవర్గం :**

శ్రీ ఆకెళ్ల మల్లికార్జునశర్మ
శ్రీ మల్లాది సూరిబాబు
శ్రీ పి.వి.ఎస్. శేషయ్యశాస్త్రి
శ్రీ నేమాని సోమయాజులు
శ్రీ తాతపూడి వెంకట సుబ్బరాయ శాస్త్రి
డా॥ శ్రీమతి ద్వారం వి.జె.లక్ష్మి
డా॥ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం
డా॥ ఎమ్. పురుషోత్తమాచార్య
శ్రీ కె.ఎస్.ఆర్. బాలకృష్ణ శాస్త్రి
శ్రీ జొన్నలగడ్డ సూర్య ఈశ్వర ప్రసాద్
శ్రీ విష్ణుభట్ల శ్రీరామ చంద్రమూర్తి
విజయనగరం కుమారి డి.వర్ధని
శ్రీమతి మల్లాప్రగడ జోగులాంబ
డా॥ ఆర్. మాధురి దేవి
శ్రీమతి బురిడి అనూరాధ పరుశురాం
శ్రీ ఎమ్.వి.సింహాచల శాస్త్రి భాగవతార్
శ్రీ ఇ.వి.కృష్ణమాచార్యులు

**సారధ్య సంఘం :**

శ్రీ ఎం.ఎస్.శ్రీనివాస్
శ్రీ ఎన్.వి. రమణ
శ్రీ బి. మారుతీ రఘురామ్
శ్రీ ఎమ్.అచ్యుత రామయ్య
డా॥ శ్రీమతి టి. సూర్యకాంతం
శ్రీమతి నూలి వెంకట లక్ష్మీదేవి, M.A.,M.A.,M.A.
శ్రీమతి వై. రమాప్రభ, ,M.A., (Music)
శ్రీమతి ఎస్. సుబ్బలక్ష్మి, M.A.,M.A.,M.A. (Music)
శ్రీమతి పి.రమాదేవి, హనుమకొండ
శ్రీమతి ప్రభల రాజేశ్వరి
శ్రీమతి ఎ. భారతీదేవి, గుంటూరు
శ్రీమతి ఎమ్.వై.శేషరాణి, గుంటూరు
కుమారి మండపాక నాగలక్ష్మి


పేజిలలో ఈ సంచికలో...


2. వాగ్గేయశిల్పము - త్యాగరాజస్వామి - శ్రీ కొమాండూరి శేషాద్రి
5. ఉనికే ఎరుకే ఉత్తమగతి - శ్రీ మల్లాది సూరిబాబు
9. తెలుగునాట పెళ్ళి కచేరీలు - శ్రీ మోదుమూడి సుధాకర్
11. ఆనందభైరవి - శ్రీమతి వనజ, హైద్రాబాద్
15. నేను - నా పాట - రావు బాలసరస్వతి నేపథ్యగాయని
17. భక్తి 'సంగీతం' - డా.సి. ఉమాప్రసాద్
19. నిన్నే భజన - శ్రీ ఆలమూరు విజయభాస్కర్
21. పాల్ఘాట్ శ్రీ.టి.ఎస్. మణి అయ్యర్ - శ్రీ కె.సద్గురు చరణ్
25. ఇందూరు జిల్లా జానపదులు - పెళ్ళిపాటలు - శ్రీమతి టి.స్వప్నరాణి
28. నేమాని అంతరంగం - శ్రీ జె.ఎస్.శాస్త్రి
33. స్వర్గీయ శ్రీమతి లక్కరాజు శేషకుమారి గారి సంస్మరణ
34. సంగీత సభల కార్యకలాపములు - విహారి


## ముఖచిత్రం

1. మైసూరు దత్తపీఠం నుండి 'నాదనిధి' అవార్డును మే నెల 24న (2022) స్వీకరించిన సంగీత విద్వాంసులు శ్రీ మల్లాది సూరిబాబు.

2. ప్రముఖ సంగీత విద్వాంసురాలు, రచయిత్రి, విమర్శకురాలు శ్రీమతి వేమూరి రామలక్ష్మిగారిని గుంటూరు శ్రీ గాయత్రీ మహిళా సంగీత సన్మండలిలో పద్మశ్రీ అన్నవరపు రామస్వామిగారు సత్కరిస్తున్న దృశ్యం.

3. ప్రముఖ సంగీత సభా కార్యదక్షురాలు, సరస్వతీగానసభ ఉపాధ్యక్షురాలు శ్రీమతి లక్కరాజు శేషకుమారి గారికి 'గానకళ' నివాళులు అర్పిస్తున్నది.

Email : ganakalamagazine@yahoo.co.in కు కళాకారులు, సంస్థలు వార్తలు, ఫోటోలు పంపవచ్చు.

# వాగ్గేయ శిల్పము - త్యాగరాజస్వామి

- శ్రీ కొమాండూరి శేషాద్రి

సంగీత మూర్తి త్రయమందు శ్రీ త్యాగరాజ స్వామికొక ప్రత్యేక స్థానమున్నది. ఆయన ధాతు మాతు కల్పనాశక్తి వైవిధ్యభరితము. కృతులలో భక్తి - భావము - సంగీత స్రవంతి ముప్పిరిగొని త్రివేణి సంగమంలో రసాశ్రితుల సేద తీరుస్తుంది. ఆస్వాద సౌలభ్యమైన రాగతాళ సమన్వయం కృతిభావమును ద్విగుణీకృతం చేసి శ్రోతలనలరించుతుంది. ఆయన కృతులు యితరులవలె ప్రణాళికాబద్ధములు కావు. ప్రతిరచన వెనుక ఒక ఉద్వేగ భరితమైన సంఘటన - స్పందన పురస్కరించు కొని తాదాత్మ్య భావంతో వెలువడ్డ రాగరస ప్రవాహ జనితాలు, ఆ కమనీయగేయాలు ఆత్మాశ్రయాలే. తనకూ పరాత్పరుడైన శ్రీరామపరబ్రహ్మమునకు గల అవినా భావ సంబంధాన్ని తేటపరచేవే. "రామ ఏవ దైవతం" అని కదా ఆయన నిరూపణము.

కేవల సాహిత్య దృష్టితో చదివినా ఆ రసమయ హక్కు అనంత భక్తి ప్రపూరితమై పరవశము కల్గిస్తుంది. ఆయనది ప్రసన్న గంభీర రసవద్గంగా విన్యాసము. మరింత గేయరూపంగా పాడినపుడు (పాడవలసినదే కదా!) దర్శనీయమౌతుంది. సాహిత్యంలో రసభావాన్ని గేయంగా నిరూపించునపుడు తత్సదృశ, స్వరూప స్వభావాన్ని మరింత వినిమయం చేసే రాగనిర్ణయము, స్వర ఎత్తుగడ, స్వరాభివృద్ధి చేసి సంగీత కృతికి రసాకృతి కల్పిస్తాడు. ప్రకృతము నాలుగు, అయిదు రచనలు పరిశీలన చేద్దాము.

ఇంద్రియములు మనసును నిగ్రహిస్తే ఉత్తమ బుద్ధితో సంస్కారములు అలవడుతాయి. నిజంగా కొన్ని కృతులును పరిశీలిస్తుంటే త్యాగయ్య సమాజానికి నీతిరీతులను ప్రబోధించిన వైతాళికుడనే చెప్పాలి. ఆయన రచనలు కాల్పనిక సమాజమునకు సమస్యల సమాధాన్నందిస్తాయి. గానంతో భగవానుని అలరించు తూ మరొకవైపు సమాజానికి చక్కని రాజమార్గంను అన్వయించిన ఋషిసత్తముడు - విశ్వశ్రేయస్సే కదా కావ్య ప్రయోజనం.

## శాంతము లేక..

సామరాగములో పొందుపరచబడ్డ ఈకృతి విని పరవశించని వారుండరు - సామరాగస్వరాలు ప్రశాంత తత్త్వాన్ని - రసభావాన్ని ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్గిస్తాయి. నిత్యనిర్మల బుద్ధి-నెమ్మది - స్థిరత్వాన్ని చూపుతాయి. కేవల సరళమైన ధాతువుతో విళంబ ఆదితాళములో రచించిన ఈకృతి సాహిత్య భావాన్ని ద్విగుణీకృతం చేసే వర్ణమెట్టుతో నింపాదిగా నిర్మల ప్రశాంత మానసిక వ్యవస్థను వినేవాళ్ళకు కల్గించడం అనుభవనీయుము - స్వరమర్మములను తెలిసిన యోగియై నందువల్ల రాగ భావాన్ని, కృతి భావాన్ని మరింతగా సమన్వయ పరచినాడు. మోక్షగామి కావాలంటే శాంత మనస్వికావాలి కదా!

## ఏల నీదయరాదు...

అఠాణారాగం వీరరసప్రధానమైనది - ఠాణా అంటే చెర-బంధం. అఠాణా అంటే అట్టి బంధాన్ని ఛేదించేద నర్థం. రాగరసభావం దైన్యానికి వ్యతిరేకమైన ఉత్సాహ వీరరస భావ ప్రధానమైనది. మానవుని లౌకిక బంధాలనుండి వదలించి పరాత్పరునివైపు మరల్చ గలిగిన రసస్థితి వినియోగము.

రామతారక మంత్రానుష్టానమైన పిదప త్యాగయ్యకు ప్రధమ సందర్శన సాక్షాత్కరమున విశ్వామిత్ర యాగ సంరక్షణకై వెడలుచున్న శ్రీరాముని ఆకృతి కనబడినది. అంతకుముందే ఆవేదనతో ఏలనీదయరాదు అని ప్రశ్నించి నిద్రాణుడైనాడు. వెన్వెంటనే ఆదివ్య సందర్శనమైనది. తాదాత్మ్యంతో హేరామ!

## బాలకనకమయచేల - సుజనపరిపాల

జలధిగంభీర- దనుజసంహార-యిత్యాది విశేషణ ములతో ఆశువుగా పాడినాడు - క్షణంలో ఆమూర్తి కనుమరగుకాగా విభ్రాంతి చెంది రా రా; దేవాదిదేవా రారా! మహానుభావ! రారా రాజీవనేత్ర - దశరథపుత్రా! అని ఆవేదనతో స్వామిని వేడుకొనినాడు - దయాంత రంగుడైన రాముని మూర్తి మరల గోచరించినది - వెన్వెంటనే "సారతరసుధాపూర హృదయ" మరిన్ని విశేషణములతో పాడగా మూర్తి గోచరించి మరలినది. మరల"నాగశయన వరనాగవరద"అంటూఉదాత్తంగా ఆర్తి భావుకతతో పాడగా దృశ్యము గోచరమైనది. ఇటుల సమయ, సన్నివేశ సందర్భముల నన్వయించుకొని తగు లయ ప్రవర్తనతో ఆయా సాహిత్య భావ సౌ కుమార్యాని కనుగుణమ్మైన స్వర సంగతి సందర్భములతో సంగీత ప్రవర్తనను అన్వయం చేసి యిటు సాహిత్యపరంగా అద్భుత రమణీయకంగాను సంగీతప్రవర్తనలో ఉత్తమ నాద శిల్పమును ప్రతిష్టిం చారు. భావగాంభీర్యము - రసమయ వాక్కు - మృదుమధురమైన సరళ జటిల పద సమ్మేళనంతో - కృతిస్థాయిని ఒకరసవత్తర చిత్రాన్ని మన ముందుంచినారు త్యాగయ్య - వ్రాయడం కంటే ప్రత్యక్షంగా పాడినపుడు అన్వయించి చూపితే యింకా అద్భుతంగా ఉంటుంది.

## ఎంతనే వర్ణింతు..

ముఖారి రాగంలో రచించబడిన ఈ కృతి ఒక విలక్షతను కల్గియుంది - అసలు ముఖారిరాగం శోకరస ప్రధానము, త్యాగయ్యవారే "క్షణమై తిరుగ జన్మించే సిద్ధి మానురా" అని ఈ రాగంలో పాడినారు. అట్టి శోక రస ప్రధానరాగాన్ని అదేమి చిత్రమో ఆనందాతి రిక్తతను ప్రబలంగా చూపుతూ "శబరి భాగ్యము ఎంతని నే వర్ణింతు" - అని భావుకంగా గేయకల్పన చేసారు. స్వర మర్మము తెలిసిన నాదోపాసనాకలితుడైనందున ఈ రచన ఎత్తుబడిలోనే రాగభావాన్ని, రసభావాన్ని విచిత్రంగా మార్చి ఆనందరసమునకు పీట వేసినారు. ఇందుకు ఈ రాగంలో మధ్యమ - నిషాధ స్వరముల దీర్ఘత్వాన్ని బాగా తగ్గించి పంచమ స్వరానికే న్యాసస్థితి కల్పించడమే కారణం.

సాహిత్యపరంగా ఈ కృతి ఒక చిత్రముగా కనబడుతుంది. ముఖ్యంగా చరణభాగములో **'కనులారా సేవించి కమ్మని ఫలముల నొసగి - తనువు పులకరించి పాదములకు మ్రొక్కి - ఇనకులపతి సముఖంబున పునరావృత్తి రహితపదమును బొందిన త్యాగరాజ వినుతురాలి పుణ్యంబును'** అంటూ రచన ముగించబడుతుంది. ఇదంతా నిజంగా ఒక క్రమానుగత చిత్రము. భావోద్దీపన సంగీత ప్రక్రియ.

అయితే గాయకులు కొందరు ''శబరి'' అని ముగిస్తారు. త్యాగయ్య కొనియాడినది శబరి భాగ్యమును. పరమోదాత్తచరితులైన మునిపత్నులకే అలభ్యమైన భగవదనుగ్రహము ఒక భిల్లవనితకు లభించడం అపూర్వం. ఆడంబరములేని కేవల నిష్కళంక భక్తికి భగవానుడెపుడూ వశుడే అనేది "సర్వసముడు" పరమాత్మయని త్యాగయ్య తెలిసి సంతసించడం ఈ కృతిలో కానవచ్చే నిరూపణము. విళంబకాలం కాకుండా మధ్యమకాలంలోనే గానం చేయడం భావ వ్యాప్తికి తోడైయ్యింది. రూపకతాళములో కృతి రచనవల్ల మధ్యమ నిషాద న్యాసముల వ్యాప్తి సంపూర్ణంగా వదలివేయబడి

పంచమ స్వరన్యాసము భావానికి తోడైంది. తక్కువ మాత్రలు కలిగిన రూపక తాళము భావానికి అద్దం పట్టింది.

## ఉయ్యాల లూగవయ్య...

ప్రతి మాతృమూర్తి తన పసికందుని గానంతో స్వరలయస్ఫూర్తి ఉన్నా లేకున్నా జోలపాట పాడి నిద్రకు మరల్చుతుంది. ఇదే భావంతో వాగ్గేయకారులు తాము భక్తునిగా, పరమాత్మని జగన్నాథునిగా కీర్తిస్తూ పవళింపు సేవ చేస్తారు. పవళింపు ఒక అద్భుతమైన ఉపచార ప్రక్రియ. మేలుకొలుపు మొదలు పవళింపు వరకు నిత్య నిరంతరాయముగా త్యాగయ్య రామమూర్తికి అందించిన షోడషోపచార ప్రక్రియ తత్సంబంధిత కృతులు తెలుగునాట సుపరిచితాలు. ప్రకృతము పరాత్పరుని పవళింపుకై 'నీలాంబరి' రాగంలో 'ఉయ్యాలలూగవయ్య' అనే రచనలు ఖండమాత్రల కన్వయంగా ఖండగతి – ఖండచాపునకు ఒదిగించినారు. ఉదాత్త గంభీర ప్రసన్న – ప్రశాంత భావాలు ఈ రాగపు సొత్తు – కేవల సాహిత్యం చూసిన ఖండగతికి సమంగా వుంటుంది. ఈ రాగంలో 'ఉ య్యాల' లూగవయ్య అనే షడ్జమ స్వర ప్రారంభం "ఊగవయ్యా" అనే సాహిత్య నిలుపుదల మధ్యమంలో వుండటం అల్లాగే అనుపల్లవి 'సయ్యాట పాటలను' అనడంలో ఉల్లసిత గమకం, చరణము ఆరంభం ''షడ్జమస్వరం'' ఇల్లా అన్ని సందర్భాలలోను సంవాదిస్వర వినియోగం వల్ల మధ్యమ నిషాదాలు దీర్ఘించడం వల్ల కృతికే – అందం – ఆకర్షణ – అందినాయి. ఉయ్యాల లూగ వయ్య కృతి వింటుంటే – మనమూ స్వామిని పవళింపు చేస్తున్నామా! అన్నట్లుంటుంది.

ఇలా త్యాగరాజ బుధకోవిదుడు సంగీత సాహిత్య (ధాతుమాతు) కల్పనాదక్షతను లోకానికి అందించి భక్తి – భుక్తి గరపి తాను తరించి మనల తరింపచేసిన మాన్యయశుడు – నాదోపాసనాకలితుడు.

# నాదయోగి

– ప్రతాప సుబ్రహ్మణ్య శాస్త్రి, ఎమ్.ఏ

జపియించినాదు దాశరథి మంత్రము తన్మ
యత్వాన తొంబదియారు కోట్లు
నిరసించినాడు భూవరు లొసంగెడు ధన
కనక వాహనముల కాంక్షలేక
రచియించినాడు పరవశుడై వేనవేల్
కృతులను విబుధ సంతతులు పొగడ

దర్శించినాడు సీతారామలక్ష్మణా
దుల భవబంధాలు తొలగిపోవ
ఐహిక సుఖాలు కోరని యాత్మవేత్త
రామపాద పయోరుహార్చన రతుండు
వేద వేదాంగవిదుడైన నాదయోగి
రాగమయమూర్తి కాకర్ల త్యాగరాజు.

తంబుర మీటుచున్ స్వరసుధారసవాహిని
పొంగిపోవ గా
నంబున సర్వలోక కరుణాకరమంజుల
రామరాట్పదా
బ్జంబుల భక్తి గొల్చి యపవర్గ పదంబును
గాంచి నీదు జ
న్మంబును సార్థకమ్ముగ నొనర్పగ జాలితి
దివ్యగాయకా!
మ్రోళ్ళు చిగుర్చు నీ మధురమోహన కోమల
గాన ధారకున్
ఊళ్ళు కలంగు నాగములు నాట్యముచేయు
ఫణాళి విప్పి యె
న్నాళ్ళు తపంబు చేసి రఘునాయకు గాంచితో
మా యెదందలన్
బీళ్ళను రామభక్తి రసబీజములన్ వెదజల్లి నావయా!

# ఉనికి ఎరుకే ఉత్తమ గతి



– మల్లాది సూరిబాబు

"తెలిసి రామ చింతనతో నామము
సేయవే ఓ మనసా'
తలపులన్ని నిలిపి నిమిషమైన
తారక రూపుని నిజ తత్త్వార్థము
రామా యన చపలాక్షుల పేరు
కామాదుల పోలు వారు వీరు
రామా యన బ్రహ్మమునకు పేరు
ఆ మానవ జన నార్తులు దీరు ॥తె ॥
అర్కమనుచు జిల్లేడునకు పేరు
మర్కట బుద్ధులెట్లు దీరు
అర్కుడనుచు భాస్కరునకు పేరు
తర్కమనే అంధకారము దీరు ॥తె॥
అజమనుచును మేషమునకు పేరు
నిజ కోరిక లేలా గీడేరు?
అజుడని వాగీశ్వరునకు పేరు
విజయము గల్గును త్యాగరాజ నుతుని ॥తె॥

ప్రసిద్ధమైన త్యాగరాజ కీర్తనల్లో ఇదొకటి. సంగీత విద్వాంసులు సాధారణంగా పల్లవి, అనుపల్లవి, తర్వాత ముద్రాచరణంతో ముగించటం అలవాటు. అంటే 'త్యాగరాజనుత' అనే ఆఖరి చరణమే పాడతారు.

నిశ్చల మనోశక్తికి గుర్తుగా ఈశ్వరుడే 'దక్షిణామూర్తి'గా కనిపిస్తాడు. అంటే వృద్ధులైన శిష్యులెదురుగా పరబ్రహ్మతత్త్వాన్ని మౌన వ్యాఖ్యానం ద్వారా అందిస్తాడు.

ఆ శిష్యులకు శాస్త్ర విషయాల్లో ప్రావీణ్యత ఉంది. కానీ, తత్త్వ సారాన్ని గ్రహించలేదు.

వారికి మిగిలిపోయిన ధర్మ సంశయాలు అంతటా వ్యాపించి పోయిన దక్షిణామూర్తి మహామౌనంలో నివృత్తి అయ్యాయి.

నిశ్చల మనస్సుకు సూటైన మార్గాన్ని తన మౌనం ద్వారా లోకానికి అందించిన మహనీయులు భగవాన్ రమణమహర్షి సన్నిధిలో ఒక్కొక్కరికీ ఒక్కో అనుభవం.

దక్షిణామూర్తిలో మూర్తీభవించిన నిశ్చల మనోశక్తికి రమణుల జీవితమే శాశ్వతమైన గీటురాయి. ఒకరోజు రమణ మహర్షిని అడగాలని ప్రఖ్యాత తాత్త్వికవేత్త పాల్ బ్రంటన్ కొన్నిప్రశ్నలను ముందుగా జాగ్రత్తగా రాసుకుని సిద్ధం చేసుకుని, ఎన్నో సంశయాలతో భగవాన్ కూర్చున్న హాల్లో ప్రవేశించారు. భగవాన్ మంచం మీద అతి సహజసిద్ధమైన స్థితిలో శాంతమూర్తియై కూర్చున్నారు.

హాలంతా నిశ్శబ్దంగా ఉంది. అలా గంటకు పైగా గడిచింది. మరో గంట గడుస్తోంది. ఇద్దరి మధ్య ఏ రకమైన సంభాషణా లేదు. మౌనమే. భగవాన్‌ని అడగాలని పెట్టుకున్న ప్రశ్నలన్నీ బ్రంటన్ నుంచి నెమ్మదిగా జారుతున్నాయి. ఆ ప్రశ్నలను అడగాలా? వద్దా? అనేది కూడా ఆయనకు పట్టలేదు. ప్రశాంతత! ఒక నదిలా తన ప్రక్క నుంచి ప్రవహిస్తూ, తన అంతఃకరణాన్ని తాకిన అనుభూతి మాత్రం తనకు తెలుస్తోంది. ఇంక ప్రశ్నలు సంధించవలసిన అవసరం తనకు కనిపించలేదు – ఆయన సన్నిధిలో. మౌన ఆశీర్వాదం లభించింది. తృప్తిగా లేచి వెళ్ళిపోయాడు బ్రంటన్.

తలపులకు తాళం వేయటమంటే అర్థం అదే. మౌన వ్యాఖ్యకు పరమార్థం కూడా అదే. భక్తులు భావాలు పంచుకుంటారు అనటానికి నిదర్శనం. త్యాగరాజు రచించి పాడుకున్న 'పూర్ణచంద్రిక' రాగంలోని కీర్తన ఇది.

మానవ దైనందిన జీవన విధానానికి తలమానికంగా నిలిచే కీర్తన. పట్టుమని పదినిమిషాలు ధ్యానం చేయగలిగితే చాలు – కానీ బుద్ధిని నియంత్రించి నిలబడటం చిన్న విషయం కాదు. ఎందుకంటే మన తలపులకు తలుపులుండవు.

ఆశలకు, ఆలోచనలకు ద్వారబంధాలు, తాళాలు ఉండవు.

విరామం లేకుండా దిక్కుమాలిన పరుగులే పరుగులు. ఏవేవోఆకాశహర్మ్యాలే. పెట్టుబడి అక్కర్లేదు. కానీ తిరిగి రాని కాలం మాత్రం గాలిపాలు. తారకరాముణ్ణి తత్త్వం తెలిసి భజించే భక్తుల వెనకాలే వుండి వారి సేవ చేస్తాట్ట పరమాత్ముడు.

మనసులోని భావాలను వ్యక్తం చేయటానికి మాటలకు శక్తి లేదు. నిజానికి మాటలు చాలవు. 'ఎన్ని జన్మల్లో చేసిన పాపాలైనా మానవజన్మ లభించినందుకు సార్థకం చేసుకుని బ్రతకరా నాయనా' అని నెత్తి నోరూ బాదుకుని యోగులైనా, నాదయోగులైనా చెవిన ఇల్లు కట్టుకుని చెప్పారు.

త్యాగయ్య భౌతిక దేహంతో 80 ఏళ్ళున్నా, యశః కాయంతో ఎందుకు ఎవరికోసం, ఈనాటికీ మన మధ్య వున్నారో తెలిస్తే చాలు. తత్త్వం తెలిస్తే అహంకారముండదు.

అహంకారం ఛస్తే 'ఆత్మే' తానవుతాడు. నశించే శరీరం కాదు. ఆత్మలోనే ఉంది శరీరం. ఆత్మేవ జగత్సర్వం.

ధనబలం, విద్యాబలం లేదా అహంకారం, రాజ్యాధికారం, ఇవన్నీ సహజంగా, అభిమానాన్ని అభిజాత్యాన్ని పెంచి పోషిస్తూ ఉంటాయి.

తత్త్వం తెలుసుకునేంతవరకూ 'సునామి' లా ఒక ఊపు ఊపేస్తాయి. అయోమయంలో పారేస్తాయి.

ఉన్నచోట స్థిమితంగా ఉండనివ్వవు. లోకతత్త్వం తెల్సుకోవాలన్నా శరీర తత్త్వం, ఆత్మతత్త్వం తెలుసుకోవాలన్నా వివేకం ఉండి తీరాలి.

అన్నిటికీ మనస్సేప్రధానం. రామచంద్రుణ్ణి ధ్యానించినపుడు ఆయన నిజ తత్త్వం తెలిసి ధ్యానిస్తే అది ఫలవంతమౌతుంది. ఒక్కో మాటకు రెండు అర్థాలున్నాయి. రామ అంటే 'స్త్రీ' అనే అర్థముంది. తారక రాముణ్ణి స్మరిస్తే పరబ్రహ్మ స్వరూపం తెలుస్తుంది. సంసార దుఃఖ నివృత్తి కలుగుతుంది. నిజమైన సంగీత సద్గురువు త్యాగరాజే.

ముగ్గురు సంగీతమూర్తులూ ఒకే వూళ్లో వున్నారు. ఎవరి ధోరణిలో వారు పాడుకుంటూ బ్రతికారు. ఎవరి శిష్యులు వారికున్నారు. ఒకరంటే మరొకరికి గౌరవమే. అన్యోన్యం గానే ఉండేవారు తప్ప అసహనం గానీ, అహంకారం గానీ, మత్సర బుద్ధి గానీ ఎఱుగరు కాబట్టే ప్రాతఃస్మరణీయులయ్యారు. సంగీత లోకానికి ఆదర్శ పురుషులయ్యారు.

తమ జీవితాలను సంగీత మార్గంలో నడుపుకుని తరించారు. ఆ దారిని మనకూ చూపించారు.

తనకంటే గొప్పవారిని అభినందించటం, తక్కువ వారిని ప్రోత్సహించి మాట్లాడటం సంగీతజ్ఞులకుండే ప్రాథమిక సద్గుణాలు.

ఇవి లోపించినంత కాలం, వారి పాటకు పెరుగుదలంటూ వుండదు. ఎండమావిలా కనిపిస్తుంది. అంతే.

సంగీత మూర్తి త్రయమైన (శ్యామశాస్త్రి, త్యాగరాజు, దీక్షితులు) ఏ ఒక్కరికీ కీర్తి కండూతి లేదు. రాజులతో గానీ రాజాస్థానాలతో గానీ పనిలేదు. రాజుల్ మత్తులు, వారి సేవ నరకప్రాయమని వాళ్ళకు చాలా దూరంగానే బ్రతికారు.

భద్రాచల రామదాసు, కబీరు వంటి వారెందరో వున్నారు. 96 కోట్ల రామనామ జపం చేసినది ఒక్క త్యాగయ్యే.

భక్తులలో త్యాగయ్యకు ప్రహ్లాదుడే స్ఫూర్తి. ఆదర్శమూర్తి. ఆయననే అంతరంగంలో నిలుపుకుంటూ, ఆయననే స్మరిస్తూ, ప్రహ్లాదుడికి లభించిన ముక్తి మార్గాన్ని తనకూ ప్రసాదించమని చేసే వేడుకోలు ప్రయత్నమే ఆయన 'ప్రహ్లాద భక్త విజయం'.

సంగీతానికి అనువైన అజంత భాష మన తెలుగు భాష, అరవ దేశంలో వుండి అచ్చ తెలుగులో నాదోపాసనను మేళవించి, సప్తస్వర సుందరులను భజించి, సంగీతజ్ఞులకో మార్గం చూపించిన ఆ మహానుభావుణ్ని తలచుకోని వారెవ్వరు?

అందుకే సంగీత సాహిత్యనిధి అయిన త్యాగరాజు కీర్తనలన్నీ ఆయన మనసులో ఉండి ఆశువుగా బయలుదేరినవే.

*****

సంగీత జ్ఞాన విహీనులకు మోక్షము గలదా? యని నిర్మొహమాటంగా ధైర్యంగా త్యాగరాజు వేసిన ప్రశ్నకు కలదని నిర్భయంగా ప్రత్యుత్తరమియ్యగలిగిన వారింతవరకూ పుట్టలేదు.

ఈ వేళ అటువంటి పెద్దలు ఏర్పరిచిన సంగీత మార్గంలో

ఎందరు ప్రయాణిస్తున్నారు?

సంగీతాన్ని జీవికగా (తేలికగా) చేసుకుని బ్రతికేవారే ఎక్కువ. ఇంకా నయం. పాడేందుకు ఇష్టం లేకపోయినా, పాడటం తమకు తెలియకపోయినా కనీసం ఇతరులు పాడితే సంతోషించగల చైతన్యం ఇంకా లోకంలో వుంది అనేవారు సంగీత విమర్శకులు రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ. ఒక విద్వాంసుడు గానం చేస్తూంటే మరో విద్వాంసుడు కూర్చుని వింటే గండపెండేరంతో సత్కరించి, గజారోహణం చేసినంత సంబరపడే వారుంటారు. కానీ, అటువంటి వారు అరుదు.

విద్వాంసుల కంటే, సంగీత పరిచయం బొత్తిగా లేని వారి ఎదురుగా పాడటం కష్టం. వారికి తెలుసుననుకుని పాడాలా? తెలియదనుకుని భావించి, దానికి తగ్గట్టుగా పాడాలా? అనే మీమాంసతో గాయకుడు సతమతమౌతాడు. వారికి బాగా పరిచయమున్న రాగాల్లోనే కీర్తనలు వినిపించటమే అవుతుంది. సినీ రంగంలో సుప్రసిద్ధ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పాట, ప్రతిభలను గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఆయన భార్య సావిత్రిగారితో 2003 వ సం.లో విజయవాడ రేడియో కేంద్రంలో నేనే ఒక ఇంటర్వ్యూ చేశాను.

సంగీత విద్వాంసులు సైతం మెచ్చుకునే గాయకుడు కదా మీ ఆయన? మీరున్న మద్రాసు నగరంలో ఎన్నో సంగీత సభలున్నాయి. ఎందరెందరో మహా విద్వాంసులు పాడుతూంటారు. ఎప్పుడైనా సంగీత కచేరీలకు వెళ్ళి వినాలనే ఆసక్తి వుండేదా? అని అడిగాను. దానికి ఆమె 'ఆయనకు కర్ణాటక సంగీతం ప్రాణం. నిజానికి ఆయనకు భిక్ష పెట్టినది ఆ సంగీత జ్ఞానమే. అదే లేకపోతే రాగాల స్వరూప స్వభావాలన్నీ ఎలా తెలుస్తాయి? మహా కవి కాళిదాసు చిత్రం కోసం 'కల్యాణి' రాగంలో 'మాతా మరకత శ్యామా, మాతంగీ' అనే శ్యామలా దండకం విని పరవశుడైన ఒక సంగీత రసికుడు మా ఇంటికో రోజు పొద్దున్నే వచ్చి బుట్టెడు పళ్ళు ముందు పెట్టి తమిళంలో మాట్లాడుతూ 'అయ్యా! మీ వంటి గాయకుడు దొరకడం తెలుగు సినిమా రంగం చేసుకున్న పుణ్యం. నేను రెండు దశాబ్దాలుగా కేవలం కర్ణాటక సంగీత కచేరీలు మాత్రమే వింటాను. ఏ సినిమాలు చూడను. సినిమా పాటలు వినను. మా యింట్లో ఎవరూ వినరు. సినిమాలకు వెళ్ళరు. ఆర్తిగా మీలా గానం చేసి మ్రొకరిల్లితే ఎదురుగా అమ్మవారొచ్చి నిలబడదా?' అని కళ్ళనీళ్ళ పర్యంతమై పాదాభివందనం చేసి వెళ్ళిపోయాడు. నిజానికి మనసులో సంగీత కచేరీలకు వెళ్ళి వినాలనే వుండేది. కానీ సమయం సరిపోయేది కాదు.

తీరా వెళ్దామని అనుకునే లోగా, తనలో తాను 'ఎన్నో ఏళ్ళు కష్టపడి శుద్ధమైన కర్ణాటక సంగీతం నేర్చుకుని, అందులో హాయిని అనుభవించిన నేను... బ్రతుకు తెరువు కోసం ఈ సినిమా పాటలు పాడవలసి వస్తోంది కదా' అని చింతించ వలసిన స్థితి వస్తుంది. – 'నన్ను వెళ్ళమనకు. వీలు చేసుకుని ఎప్పుడైనా ఇంట్లో కూర్చొనే వింటానులే' అనేవారు.

నిజమైన పండితునికి బుద్ధే ప్రమాణం. ఇది ప్రాచీనం. యిది అర్వాచీనం, యిది సాంప్రదాయం, ఇది ఆధునికం అనే భేదాలుండవు. బుద్ధికి తోచినదాన్నే ప్రమాణంగా స్వీకరిస్తారు. ప్రమాణానికి బద్ధమైన దాన్నే అంగీకరిస్తారు. ఘంటసాల పాడిన సంప్రదాయ సంగీత ధోరణి పాటలే దీనికి ఉదాహరణ. మన గురించి మనమే పట్టించుకునే సమయ ముండదు. అవతలి వారిని గురించి ఆలోచించేదెవరు? వోలేటి సుబ్బారావనే ఆప్తమిత్రుడొకాయన వున్నారు. పరుల యోగక్షేమాలు తెలుసుకోవటమే ఆయన ప్రవృత్తి. సంగీత సాహిత్యాలంటే ప్రాణం. ఆయన పిల్లలు అమెరికాలో వుంటారు. అక్కడున్నా, ఇక్కడున్నా దూరమైనా, భారమైనా, తాను ప్రాణంగా భావించేవారితో ఏదో ఫోన్‌లో బాతాఖానీ కాదు. స్వయంగా వారిళ్ళకు వెళ్ళి పలకరించే స్వభావం కలిగిన అరుదైన స్నేహశీలి.

మద్రాసు వెళ్తే ప్రముఖులను కలవకుండా యింటికి రాడు. ఆ మధ్య మద్రాసు వెళ్ళినప్పుడు అక్కడ ఘంటసాల కబుర్లు తీసుకొచ్చి, వినిపించాడు. సినిమా అవకాశాలు వెతుక్కుంటూ ఏ ఆధారమూ దొరక్క మద్రాసులోని పానగల్లు పార్కులో, ఘంటసాల కాలక్షేపం చేసే రోజుల్లో రామచంద్రరావనే వ్యక్తితో స్నేహం ఏర్పడింది. ఆయన మంచి సంగీత రసజ్ఞుడు.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ తన పాటలు రామ చంద్రరావుకు పాడి వినిపించేవారుట ఘంటసాల.

ఫలానా రాగం బాగుందనీ, ఫలానా రాగం ఆ పాటకు నప్పలేదనీ చెప్పగలిగేటంత చనువును పెంచుకున్న

రామచంద్రరావు విశాఖపట్నం నుంచి తమ బ్రతుకు తెరువు కోసం మద్రాసు చేరాడు. క్రమంగా అక్కడే ఇద్దరికీ స్నేహం పెరిగింది. సినిమా రంగంతో ఘంటసాల కాస్త నిలదొక్కుకోగానే అతన్ని తన వద్దే ఉంచేసుకున్నారు. చాలా కాలం ఘంటసాల ఇంట్లోనే ఉంటూ, 'సావిత్రమ్మగారికి వంటలో సహాయపడుతూ వుండేవాడు' అని చెప్పిన సావిత్రిగారు చెప్పిన మాటలు గుర్తు చేశాడు.

*****

ఇంట్లో పూజా మందిరంలో కూర్చుని ఆ ఏడుకొండల వాణ్ణి తలచుకోండి. వెంటనే ఆ దివ్య మంగళ విగ్రహుని రూపం కంటికి కనిపించదూ? ఇక్కడ కూర్చుని అమెరికాలో వున్న మీ పిల్లల్ని ఓసారి తలచుకోండి. చిరునవ్వులు చిందిస్తూ గబగబా మీ ఒళ్లో వాలే మీ మనవలు, మనవరాళ్ళ మొఖాలు మనసులో నిలిచి సంతోషాన్ని నింపేయవూ?

ఒకటే పదార్థం. రెండు రూపాల్లో కనిపించినట్లుగా సంగీతంలో రాగాలు కూడా అంతే – రాగాన్ని స్మరించగానే 'ఆ రాగ దేవతలు' సాక్షాత్కరించినట్లుగా విద్వాంసులు పాడేవారొకప్పుడు. పాలు, నీరు కలిసినట్లుగా రాగం, భావం కలిసి ఖరహరప్రియ, కాంభోజి, కాపి, కీరవాణి, కల్యాణి, మోహన వంటి ఎన్నో రాగాల్లో పాడే కీర్తనలన్నీ ఆ రాగాల్ని ప్రతిబింబించే సాహిత్య రూపాలే. రాగం, సాహిత్యం వేరు వేరు కాదు' అని భావించి రాగభావం బాగా తెలిసి పాడాడు, కాబట్టే ఘంటసాల వెంకటేశ్వరరావును నేటికీ జనం తలచుకోవడంలో ఆశ్చర్యంలో లేదు.

ఈ వేళ సినిమాలకు రాగాలతో నిమిత్తం లేదు – ఏదో ఓ బీటు వుంటే చాలు – సంగీత జ్ఞానం విధిగా గాయకులకుండాలనే నియమం లేదు – నాద సుఖంతో పనిలేదు.

*****



త్యాగరాజ కీర్తనలు ఎన్నో వందలాది ఉన్నాయి. కానీ మనకు దొరికినివి కొన్నే. విద్వాంసులు తెలియనివీ, మనం విననివీ ఇంకా వున్నాయి.

త్యాగరాజ స్వామికి ప్రియ శిష్యుడైన వాలాజీపేట వెంకట రమణ భాగవతార్ కుమారుడు కృష్ణస్వామి ప్రతిరోజూ పాడినవి మళ్ళీ పాడకుండా పదేసి కీర్తనలు పాడితే గాని, మధ్యాహ్నం భోజనం చేసేవాడు కాదు. అంటే కనీసం మూడు వేలకు పైగానే ఉండాలి. అన్నమయ్య ఏకంగా 32000 కీర్తనలు రాశాడు – దొరికినివి చాలా కొన్నే.

తెలిసిన కీర్తనలు – సంప్రదాయంగా సిద్ధంగా నేర్చుకుని పాడేందుకే జీవితకాలం సరిపోదు. ఆ మహానుభావుడు అన్నేసి కీర్తనలు ఎలా వెలువరించగలిగాడు? సమాధానం దొరకని సందేహం. మన సంస్కృతీ సంప్రదాయం పట్ల గౌరవంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ ప్రతి జిల్లా కేంద్రాల్లోనూ సంగీత నృత్య కళాశాలలు నడుపుతోంది. మహావిద్వాంసులున్నారు. అకుంఠిత దీక్షతో విద్యార్థులకు, వారికి వీలైన సమయాల్లోనే, అంకితభావంతో బోధిస్తున్నారు. కానీ విద్వాంసులెందరు తయారవుతున్నారు? అక్కడ ఏం బోధిస్తున్నారు? ఎలా చెపుతున్నారు? అనే వాటికి సమాధానం ఉండదు. దొరకదు. ఎక్కడుంది లోపం? సంగీతానికి కాల వ్యవధి లేదు. కానీ, ఏదీ తనంతట తాను వచ్చి పడదుగా? నేర్చుకోవాలనే ఉబలాటం ఒక్కటే సరిపోదు. అర్హత ఉండాలి. ఎవరి లోపాలు వారే తెలుసుకోవాలి. సంగీత కచేరీలు తప్పని సరిగా వింటూ ఉండాలి. సంగీత సంబంధమైన విషయాలు సేకరించాలి – తెలుసుకోవాలి. ●

# తెలుగునాట పెళ్ళి కచేరీలు...



- మోదుమూడి సుధాకర్

మన యాంధ్రదేశమున, వివాహాది శుభకార్యముల యందు వ్యయుమొనరింపబడు వేల కొలది రూప్యంబులలో, సంగీత సభలకై చేయబడు ఖర్చు మాత్రమే నిరర్థకమైనదిగను, నిరపయోగమైనదిగను యెంచుకొనుచుండువారు పెక్కంద్రు గలరు. తమిళు లలో, తమ ఇండ్లలో జరిగెడి వివాహాది శుభసమయ ములందు సంగీత సభల నేర్పరుపనివారును, తమ బిడ్డలకు సంగీతము నేర్పింపనివారును ఉండరని యే చెప్పవచ్చును. మన సంగీతం యొక్క విలువను దాక్షిణాత్యులు గ్రహించినట్లు మనవారింకను గ్రహింప కుండుట మిగుల శోచనీయము."

1945వ సంవత్సరము, 'గాయసార్వభౌమ' పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు, తమ షష్టిపూర్తి ప్రత్యేక సంచికలో వ్రాసిన మాటలవి!

తెలుగునాట, సంగీత ప్రాభవానికై అవిశ్రాంత కృషిచేసిన ఆ మహనీయుని మనోవేదనలో నిజముంది. వివాహాది శుభకార్యాలలో సామవేద జనితమైన సంగీత శ్రవణం, వధూవరులకే గాక, విచ్చేసిన ఎల్లరకూ శుభాన్నిస్తుంది. తద్వారా సంగీత కళాకారులకు జీవనోపాధి దొరుకుతుంది.

తమిళనాట, ఈ సంప్రదాయం ఎంత బలీయమైన దంటే... ఒక పెళ్ళి పెద్ద, తను కచేరీ ఏర్పాటు చేయదలచుకొన్న కళాకారులకు అనువైన తేదీలను ముందు తెలుసుకొని, ఆతేదీలలోనే ముహూర్తం పెట్టిస్తారు! అక్కడ కచేరీ చేసిన కళాకారులకు ఇచ్చే పారితోషికం కూడా ఘనంగానే ఉంటుంది! ఆ సంగీత కచేరీ, ఒకసంగీత సంస్థ నిర్వహించే సభలాగా కొనసాగి, కళాకారుల పాండిత్య ప్రదర్శనకు అనుకూలంగా, రసజ్ఞ శ్రోతల కరతాళధ్వనీపాత్రమై అలరారుతుంది.

మన తెలుగునాట పరిస్థితి వేరు....

మాఘమాసం వస్తుంది.... పెళ్ళిళ్ళ సంరంభం ఆరంభమౌతుంది. కళ్యాణమంటపాలు,ఫంక్షనుహాళ్ళు, స్కూళ్ళు, కాలేజీలు, గుళ్ళు, గోపురాలు, వీధులు, ఆటస్థలాలు, హోటళ్ళూ... ఒకటేమిటి? కావేవి వివాహ వేడుకలకనర్హం.. అన్న రీతిలో పెళ్ళిళ్ళతో అన్నీ నిండిపోతాయి. అనాదిగా వస్తున్న నాదస్వర వాద్యఘోషల స్థానంలో బ్యాండు మేళాలు, రికార్డింగు డాన్సులు, సినీ, పాశ్చాత్య గానాబజానాలు, భాంగ్రా నృత్యాలు, మెహందీ మేళాలు, సంగీత్ లు... పెరిగిపోయాయి.

ఇక శాస్త్రీయ సంగీతం గురించి ఆలోచించే దెవరు?అయితే... కొండొకచో, సంగీతాభిమానమున్న వియ్యంకుని తండ్రి బలవంతం మీదో, పెళ్ళికూతురు చిన్నతనంలో నేర్చుకొని వదిలేసిన గానకళపై ఆసక్తిచేతో, ఆహ్వానితుల ముందు మెహర్బానీకో, తమ బంధుగణ ంలో ఎవరైనా సంగీతం నేర్చుకుంటే వారికి వేదికనిచ్చేం దుకో... అప్పుడప్పుడూ కచేరీలు మన తెలుగువారి పెళ్ళిళ్ళ లోను జరుగుతూంటాయి.

నేనూ అటువంటి పెళ్ళి కచేరీలు వందకు పైగా చేశాను. చాలా సందర్భాలలో ఎదురైనవి చేదు అనుభవాలే! పెళ్ళి ఖర్చులన్నీ భారీగా పెట్టి, కళాకారుల పారితోషకం వద్ద మాత్రం బేరాలు ఆరంభిస్తారు. తీరా

ఒప్పుకున్నాక, పెళ్ళి ఆహ్వాన పత్రంలో కచేరి వివరాలు ఉండవు. కళాకారుల రాకను ఎవరూ పట్టించుకోరు. సకాలంలో కార్యక్రమం ప్రారంభించరు. వేదికకు ఆహ్వానించే దిక్కుండదు. కనీసం అవసరమైన మైకులుండవు. మధ్యలో కళాకారులకు మంచినీళ్ళిచ్చే నాథుడుండడు. కచేరీ వినకుండా, పెద్దవాళ్ళే వేదిక ముందు గుంపులుగా నిలబడి, బిగ్గరగా మాట్లాడు కుంటారు. ఇక పిల్లల అల్లరిని, అరుపులను నియంత్రిం చేదెవరు? అదిగాక... ' మా బంధువులమంతా ఇన్నాళ్ళకు కలుసుకున్నాము. హాయిగా మనసు విప్పి, మాట్లాడుకోనీయకుండా మధ్యలో ఈ సరిగమల సన్నాయిలేమిటన్నట్లు' వేదికపై కళాకారులకేసి ఉరిమిచూస్తారు కొందరు... 'సందట్లో సడేమియా' లాగా.. పైసా ఖర్చులేకుండా ఎలాగూ మైకులూ, ప్రక్క వాద్యాలున్నాయి కనుక, పాడుతున్నవారిని కాసేపు ఆపమని, తమ పిల్లలను వేదికనెక్కించి, వారిచేత రెండు అన్నమయ్య పాటలు, పక్కవాద్యాలతో పాడించేయాలని ఉవ్విళ్ళూరే మాతృమూర్తులు...కచేరీ మధ్యలో తమకు తెలిసిన సినీశాస్త్రీయ గీతాలు పాడమని చీటీలు పంపే రసికాసురులు.. మాటిమాటికీ కచేరీ ఆపించి, బజంత్రీ లను వాయించమనే పురోహితులు....

నూతన వధూవరులకు అక్షింతలేసి ఆశీర్వదించి, బహుమతులిచ్చేందుకు తోసుకొచ్చి, కచేరీ చేస్తున్న కళాకారులను తన్నుకుంటూ పోయే బంధు, మిత్ర, సపరివారప్రమథగణం...

కచేరీ ఎప్పుడు ఆపాలో అర్థంగాక, ఎపుడో ఒకప్పుడు ఆపి, దిగిపోతే, 'అప్పుడే ఆపేశారా! అసలు ఇప్పుడే పెళ్ళివారంతా ఒక్కొక్కరే వస్తున్నారు. తిరిగి ప్రారంభించ మ'ని పురమాయించే ఆపద్ధర్మ నిర్వాహకులూ...

భోజనాలు ఆరంభమైనాయని తెలియగానే, కచేరీ మధ్యలో అందరూ పొలోమంటూ లేచి, చక్కాపోగా, అస్తవ్యస్తంగా దర్శనమిచ్చే ఖాళీ కుర్చీలు..

కనీసం, పాడిన కళాకారులను 'భోజనం చేసి వెళ్ళండని' చెప్పేవారు లేకపోగా, ఒప్పుకున్న పారితోషకం ఇచ్చే నాథుడే దొరకని పరిస్థితి...

ఇటువంటి బాధలెందుకని, పెళ్ళి కచేరీలు ఒప్పుకోవటం చాలా వరకు మానేశాము అస్మదాదులం. ఏవీ పట్టించుకోకుండా కేవలం డబ్బుకోసమో, మొహమాటం పోతుందనో ఒప్పుకుంటే.. బాధలు తప్పవు. అయితే అన్నిచోట్లా ఇలాగే ఉంటుందని నేను చెప్పటంలేదు. తెలుగునాట, పెళ్ళిళ్ళలో చక్కగా కచేరీ ఏర్పాట్లు చేసిన సందర్భాలు అనేకం.

పారుపల్లివారికిపై విషయాలపై అవగాహన, అనుభవం లేకపోలేదు. అందుకే ఆయనే ఇలా అన్నారు? " ఏ స్నేహితులు బలవంతుముననో విధిలేక ఒకటి రెండు సభలనేర్పాటు చేయుచుండువారును గలరు. అట్టి సదస్సులలో మాత్రము గాయకుల యొక్కయు, శ్రోతల యొక్కయు అవస్థ వర్ణనాతీతము. ఆంధ్రులు గాన విద్యాధిక్యత యందు మాత్రము ఇతర దేశములవారికి దీసిపోవరని నిరాటంకముగ జెప్పవచ్చును. గాన విద్యాభిమానులగు దేశీయ సోదరులెల్లరును తమ తమ బాలబాలికలను గాన విద్యాభ్యాసకులుగా నొనరించు చుండుటయు, తమ తమ గృహంబులం జరుగు వివాహాది శుభకార్యములయందు గానసభాదికంబు లేర్పరచి, జక్కగా నిర్వహించుచుండుటయు విద్యుక్త ధర్మములుగ నెంచి, గానకళాభివృద్ధికై పాటుపడుచు సర్వేశ్వరాను గ్రహమునకు బాత్రులయ్యెదరు గాక"

●

# ఆనంద భైరవి

- శ్రీమతి వనజ, హైదరాబాదు.

ఆనంద భైరవి = ఆనంద + భైరవి = మానవులకు ఆనందాన్ని ప్రసాదించే జగన్మాత "భైరవి".

భైరవి = జగన్మాత అయిన ఆది పరాశక్తి అనంత రూపాలలో ఒకటి భైరవి రూపం. ఆమె జగన్మాత, శుభములు సమకూర్చే తల్లి. మంచివారికి సౌమ్యం గాను, చెడ్డవారికి భయంకరంగాను దర్శనమిస్తుంది. దక్షిణ భారత దేశంలో ఆమెను బాలా త్రిపురసుందరి గా పూజిస్తారు. బాల + త్రిపుర + సుందరి = బాల అనగ కన్య, త్రిపుర = ముల్లోకము, సుందరి = ప్రకాశవంతముగా వెలుగుట = బాల అనే తల్లి ముల్లోకములను తన వెలుగుతో ప్రకాశింపచేస్తుంది. ఆమె భర్త కామేశ్వరుడు (శివుడు) గా పిలవబడు తున్నాడు.

కర్నాటక సంగీతం లో ఆనందభైరవి అనేది ఒక రాగం. ఆ రాగం 20 వ మేళకర్త నటభైరవి యొక్క జన్య రాగం. ఈ రాగం పురాతనమైనది, దైవికమైనది. ఈ రాగం లో కరుణ, భక్తి, శృంగారం ప్రస్ఫుటిస్తాయి. ఇందులో ఆరోహణ లో షాడవం (6అక్షరాలు), అవరోహణ లో సంపూర్ణం (7 అక్షరాలు) పొందు పరిచారు. ఈ రాగం వక్ర రాగం. ఈ రాగం షాడవ - సంపూర్ణరాగం గా పిలవబడుతోంది. ఈ రాగం రీతిగౌళ రాగానికి చాలా దగ్గరగా ఉంటుంది.

త్యాగరాజ స్వామి ఈ రాగంలో కృతులు ఎక్కువ రచించలేదు (కూచిపూడి భాగవతులుకు ఇచ్చిన వాగ్దానం కోసం). ఆయన రచించిన నృత్య కావ్యం "మధురా నగరిలో" బహు ప్రాచుర్యం పొందింది. ఆయన రచించిన సంప్రదాయ కృతులలో "క్షీరసాగర విహార" అనే కృతి బాగా పేరు పొందింది. శ్యామశాస్త్రి రచించిన "మరి వేరే గతి" అనే కృతి బహు ప్రాచుర్యం పొందింది. దీక్షితారు వారి 2వ విభూతి కృతి అయిన 'మానస గురుగుహ' లో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సర్వశ్రేష్ఠుడుగా, తారకేశ్వరుడు గా, ఆనందభైరవుడుగా అభివర్ణించారు.

నాకు చాలా ఇష్టం అయిన రాగాల లో ఈరాగం ఒకటి. ఈ రాగం లో మహరాజ స్వాతి తిరునాళ్ యొక్క "కృష్ణకరుణ" అనే కృతిని మీకు సమర్పించుకుంటు న్నాను. స్వాతి తిరునాళ్ చేర వంశానికి చెందిన రాజ కుటుంబములో జన్మించారు. ఆయన 33సం.లు(1813 క్రీ.శ-1846 క్రీ.శ) జీవించారు. చిన్న వయస్సులో రాజుగా పట్టాభిషిక్తుడై 17 సం॥లు ఎంతో సమర్థవం తంగా రాజ్యాన్ని పరిపాలించాడు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన విజ్ఞాన శాస్త్రము లోని వివిధ భాగాలలో (గణితం లో కూడా) ప్రావీణ్యం సంపాదించారు. ఆయన దేశ భాషలైన మలయాళం, తెలుగు, తమిళం, కన్నడ,

మరాఠీ, ఒరియా కాకుండా, విదేశీ భాషలైన ఆంగ్లము, పర్షియన్ మొదలైన భాషలలోను ప్రావీణ్యం సంపాదించారు. ఆయన దక్షిణ భారత బాణీలోనూ, హిందూస్తానీ బాణీలోనూ సంగీతాన్ని అభ్యసించి కృతులను రచించారు. ఆయన సంస్కృతంలోను, మలయాళం లోను, మణిప్రవాళం (మణి =కెంపు తమిళం లో ప్రవాళం=పగడం,సంస్కృతం లో) లోను రచించారు. మణిప్రవాళం అంటే తమిళంలో సంస్కృత పదాలు ఉపయోగించడం ఆయన కొన్ని కొత్త రాగాలను సమకూర్చారు. అందులో "మోహన కల్యాణి" ఒకటి. ఆయన తొమ్మిది (నవ) విధములైన భక్తిని గురించి తొమ్మిది కృతులు (నవ వర్ణ కృతులు) రచించారు. ముగ్గురు గొప్ప వాగ్గేయ కారులు త్యాగరాజ స్వామి, ముత్తు స్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి నివసించిన స్వర్ణయుగం లో ఆయన కూడా నివసించారు.

మొదటి నుంచి తిరువనంతపురం (కేరళ, ఇండియా) రాజులకు (ఏ వంశం పరిపాలించిన) "అనంత పద్మనాభస్వామి" యే రాజవంశానికి కులదైవం. అక్కడ ఉన్న దేవాలయం చాలా పురాతనమైనది, ప్రాము ఖ్యమైనది. దేవాలయ చరిత్ర పుస్తకములలోను, అతి గొప్ప గ్రంథం అయిన "అనంత శయన మహత్యం" లోను దేవాలయం యొక్క వైభవం గురించి లిఖింప బడినది అని చరిత్రకారులు వివరించారు. ఆ దేవాలయం లోని మూలవిరాట్‌ని తుళు బ్రాహ్మణుడు అయిన "దివాకరముని" అనే సన్యాసి పవిత్రం గావించారు. దివాకర మునికి స్వామి వారు ప్రత్యక్ష దర్శనమిచ్చినట్లుగా చరిత్రకారులు వివరించారు. దివాకరముని దగ్గరకి మహావిష్ణువు బాలుడుగా వచ్చి సేవకుడుగా ఉండేవారు. ఒకసారి పూజకు ఉపయోగించే సాలిగ్రామముతో ఆడుకుంటున్న బాలుని చూసి ఆగ్రహించాడు. వెంటనే ఆ బాలుడు అడవిలోకి పరిగెత్తుకుంటు వెళ్ళి ఒక ఇప్ప చెట్టు లో అదృశ్యమైనాడు. బాలుని వెనుక పరుగెత్తిన మునికి మహావిష్ణువు విశ్వరూప దర్శనం ప్రసాదించాడు. ముని ప్రార్థించగా స్వామి ప్రస్తుతం దేవాలయంలో ఉన్న పరిమాణంలోకి కుదించారు. ఈ భంగిమతో ఉన్న మూలవిరాట్ ని "అనంత శయన" గా పరిగణిస్తారు. ఆ భంగిమలో విష్ణువు ఎడమ చేతిలో పద్మం. నాభిలో నుంచి వచ్చిన పద్మంలో బ్రహ్మ ఉంటారు. విష్ణువు అనంతుడు. నాభిలో పద్మం. వేయి తలల పాము అయిన ఆదిశేషుని (అనంత) మీద శయనించుట వలన ఆ మూర్తిని "అనంత పద్మనాభ స్వామి" గా నిర్ధారించడ మైనది. ఆ ప్రాంతమునకు "తిరువనంత పురం" అనే నామము సార్థకమైనది.

మహావిష్ణువు యొక్క మరి యొక్క రూపమైన "శ్రీ రంగనాథ" కూడా అనంత శయనుడే. తమిళనాడులో ఉన్న శ్రీరంగం లో ఉన్న శ్రీ రంగనాథుడు, కర్నాటక లో ఉన్న శ్రీ రంగనాథాలయం లోని శ్రీ రంగనాథుడు, మరి కొన్ని దేవాలయాలలో కూడా స్వామి అనంతశ యనుడే. ఐతే ఈ దేవాలయాలు అన్నిటి లోను స్వామి అనంతుని మీద శయనిస్తున్నట్టుగా విగ్రహం మలచపడ్డది. ఇక్కడ ఒకటే ద్వారం నుండి ప్రవేశము. తిరువనంతపురంలోని స్వామి మూడు

ద్వారాల నుండి దర్శనం ఇస్తారు. మొదటి ద్వారం లో అనంత శయనుడైన స్వామి కుడి చేతిలో శివలింగం, ఎడమ చేతిలో పద్మం (శేషుని పడగలో స్వామి ముఖం సగం కప్పబడి ఉంటుంది). రెండవ ద్వారం లో స్వామి నాభి నుంచి వచ్చిన కమలం లో కూర్చున్న బ్రహ్మ, మూడవ ద్వారంలో స్వామి పాదాల దగ్గర శ్రీదేవి, భూదేవి కూర్చున్నట్టుగా దర్శనం ఇస్తారు. 18వ శతాబ్దం మధ్యకాలం నుంచి చేర రాజులు స్వామికి తమని తాము అర్పించుకున్నారు. అప్పటి నుంచి వారు పద్మనాభ స్వామి దాసులుగా పిలువబడ్డారు. శ్రీ స్వాతి తిరునాళ్ మహారాజు వారు తమ కృతుల యొక్క ముద్రగా "పద్మనాభ"ను స్వీకరించారు. అంతే కాకుండా మరి కొన్ని స్వామి పేర్లను "జలనాభ", "సరసిజనాభ" "పంకజనాభ" ను కూడా స్వీకరించారు.

ఈ కృతిలో మహరాజు తనమనస్తితి గతులను స్వామి కి భావోద్వేగంతో వర్ణిస్తూ ఆయనకు విముక్తి ప్రసాదించ మని ప్రార్థిస్తున్నారు.

కృతి యొక్క భావార్థ తాత్పర్యము :

**పల్లవి :** కృష్ణకరుణకదానుతే, కృపానిధే, కృష్ణజల నాభాజాయతే; కృష్ణయ విషయమృగ, కృష్ణాయ మోహితేమయి; కృష్ణ = కృష్ణ భగవానుడు; కరుణ = జాలి, దయ ; కదా = ఎప్పుడు; నుతే = కురుపించుట; కృప = దయ; నిధి = ఐశ్వర్యము (ఇక్కడ ఐశ్వర్యము అంటే భగవంతుని దర్శనము) ; కృష్ణ = నలుపు ( ఈ సందర్భములో) ; జల +నీరు, సభ = ఆకాశం, జలసభ = ఆకాశం లో నీరు, మేఘం; కృష్ణ జలనాభ = నల్ల మబ్బు; జాయతే = ప్రకాశవంతముగా వెలుగుట; మరి యొక్క అర్థము; నాభ=పుట్టుక, జలనాభ = నీటిలో పుట్టుట, కలువు పువ్వు, కృష్ణ జలనాభ = నల్ల కలువ; దీక్షితారువారు నీలోత్పలాంబ (నల్ల కలువ) ను జలనాభుడైన (నల్ల కలువ) విష్ణువు ను ఆయన తమ కృతులలో తోబుట్టువులుగా అభివర్ణించారు. కృష్ణ=చెడు ( ఈ సందర్భములో) ; విషయ = ప్రాపంచిక విషయములు; మృగ = ఎండ మావులు, మోహ =మోహం; మయి + నేను; ఓ జగన్నాథ, దయానిధివైన నీవు, నల్లమబ్బు నుంచి ప్రకాశవంతంగా వెలిగే జ్యోతివైన నీవు, నల్ల కలువలాంటి నీవు, దుష్ట ఎండమావులపై మోహం పెంచుకున్న నా మీద ఎప్పుడు దయ చూపిస్తావు?

**చరణం:** కామాది రిపుజనతయా ఘోరసంసార కారాగృహేయి తత్సయ; కామిని కటాక్ష రూపయ శ్రుంఖలయామి కామసంయతేన రామయ; మామాఘుం పెషి తత్వయి మానసం వావవ విభో; భీమ జరాసంధ వధ భూమిపాలక బాలక. కామాది = కోరికలు, రిపు = శత్రువులు, జనతయా = బాధిస్తున్నాయి, ఘోర = భయం కరమైన, సంసార = సంసార బంధాలు, కారా గృహే = కారాగృహం లో, తత్సయ = బందింప పడ్డాను.

కామిని = స్త్రీలు, కటాక్ష = కనుచూపులలో, రూపయ = ఆకృతి, శృంఖల = బందించుట, కామ = ప్రపంచానికి సంబంధించిన కోరికలు, సంయత్= కలిసిపోవుట, తన= ఏదైనా, రమా = ప్రేమించే స్త్రీ, మామాఘుం = నాది, పేషి

అర్థించుట, తత్త్వం = భగవంతుని గురించిన జ్ఞానం, వావవ = తులసి చెట్టు లాగా పవిత్రమైన, విభో= ప్రకాశిస్తున్న, భీమ = పాండవ మధ్యముడు, భీముడు; జరాసంధ = మగధ రాజ్యాన్ని పరిపాలించిన మహారాజు, కృష్ణభగవానుని మేనమామ, రాక్షసరాజు; వధ= చంపుట; భూమి= భూమి, పాలక = పాలించుట, బాలక = బాలుడు; ఓ జగన్నాథ, రాక్షసుడైన జరాసంధుని భీముని చేత చంపించి భూమిని రక్షించి పరిపాలిస్తు న్నావు, నన్ను ఎప్పుడు కాపాడుతావు? కోరికలు అనే శత్రువులతో సంసారం అనే కారాగృహం లో బందింప బడ్డాను. నా చుట్టూ ఆడవాళ్ళూ చేరి నన్ను సంసారం లోకి చేర్చుతున్నారు. నా మనస్సు నీ కోసం ఎప్పుడు ఆత్రత చెందుతుంది? తులసి చెట్టు లాంటి పవిత్రమైన, ప్రకాశించే నీ సౌందర్యాన్ని ఎప్పుడు తెలుసుకుంటాను?

**చరణం:** తత్వమవగంతుమీషతే బ్రహ్మాదియోగి తత్పరమ్ కి మపి మేషతే; తత్భవో మహానుభావతే నమోస్తు శేషతల్ప పద్మనాభ శ్రీపతే; నిశ్చులమంగ జకోటి నిర్భర సుందర వీడమ్; సప్తతావక రూపం సంతతం ఈక్షుతు మమ : తత్=అది, ఆ, అవగస్తుం= పాండిత్యం కలిగినవారు; ఈషతే = చేరుకోవడానికి,బ్రహ్మాది యోగి=బ్రహ్మా+ ఆది+యోగి= బ్రహ్మా, యోగులు మొదలగువారు; పరమ్ = తత్వం, సత్యం, కిమపి = మనపూర్వకము గా, భావో = అస్తిత్వం, ఉనికి; మహానుభావ = మహానుభావుడు; నమః = నమస్కరిం చుట; శేషతల్ప = ఆదిశేషుని పైన శయనించినవాడు , విష్ణువు; పద్మనాభ=నాభిలో పద్మము కలవాడు, విష్ణువు ; శ్రీపతే = శ్రీ+పతే= లక్ష్మీదేవి భర్త, విష్ణువు; నిశ్చుల= సాటిలేని; అంగజకోటి= కోటి మన్మధులు; నిర్భర=లోతుగా; సుందర=అందమైన; వీడమ్ = ఆహ్లాదకర మైన; సప్తతావక = స్తోత్రము; రూపం=భగవంతుని రూపం, సంతతం =ఎల్లప్పుడు; వీక్షితు = వీక్షించుట, కన్నులారా దర్శించుట; మమ = నేను.

ఓ జగన్నాథ! బ్రహ్మా, యోగులు మొదలైనవారందరు కూడా నీ యొక్క తత్త్వాన్ని తెలుసుకోలేక పోతున్నారు. అటువంటి మహానుభావుడవు, శ్రీపతివి, పద్మనాభుడవు, శేషతల్పుడవు, కోటి మన్మధులు అంత సుందరంగాను, ఆహ్లాదకరంగాను ఉన్న పరబ్రహ్మ స్వరూపడవు ఐన శ్రీ మహావిష్ణువునకు నేను ప్రణమిల్లుతున్నాను. నేను ఎల్లప్పుడు నీ సాటిలేని రూపాన్ని కన్నులారా వీక్షించుచు స్తోత్రం చేస్తూంటాను.

మహారాజు చిన్నవయస్సుల లోనే జీవితం చాలిం చారు. అతితక్కువ కాలంలో ఎక్కువ కృతులు రచించి మనకి సంగీతనిధిని అందించారు. ఈ నిధిని భావి తరాలకు అందిస్తారని భావిస్తున్నాము.

గమనిక : నాకు ఈ కృతి సంస్కృతం లిపిలో గాని, ఆంగ్ల లిపి గాని దొరకక పోవుట వలన మలయాళీ లిపి నేర్చుకొని అనువదించాను. తప్పులు దొర్లిన సంగీత కళాకారులు మన్నించగలరు.

# నేను - నా పాట

- రావు బాలసరస్వతి -నేపథ్యగాయని

1934 లో మొట్టమొదటి సారిగా నా ఆరవయేట హెచ్.ఎం.వి. సంస్థవారు సోలో రికార్డు చేశారు. ఓగిరాల రామచంద్రరావు, కొప్పరపు సుబ్బారావుల ఆధ్వర్యంలో ఈ రికార్డింగ్ జరిగింది. చిన్నతనంలో మైక్ అందకపోవడంతో నన్ను ఎత్తుకుని పాడించారు. 'పరమ పురుష' అంటూ మొదలయ్యే ఆ పాట నాకు ఇంకా జ్ఞాపకం ఉంది.

బాలనటిగా చలనచిత్ర పరిశ్రమకు పరిచయమైన నేను సుమారు 14తమిళ,తెలుగు చిత్రాలలో నటిం చాను.

1940లో మొదటిసారిగా ప్లేబాక్ పాడే అవకాశం లభించింది. కమలా కోట్నిస్ నటించిన చెంచులక్ష్మి చిత్రానికి సి.ఆర్. సుబ్బరామన్ సంగీతం సమకూర్చగా మొదటిసారి ప్లేబాక్ పాడాను. ఆ చిత్రంలోని అన్ని పాటలు నేను పాడినవే. ఆ రోజుల్లో ఆ పాటలు ఎంతగానో ప్రాచుర్యం పొందాయి. కర్నాటక సంగీత బాణిలో కూర్చిన పాటలు ఎంతో వినసొంపుగా ఉంటాయి. 'కనిపించితివా నరసింహ - కనిపించినావా ఈ వేళ' అనే పాటతో పాటు 'తిన్నె మీదా చిన్నోడా' అనే జానపదశైలిలో సాగే పాట నేను చలనచిత్ర రంగంలో గాయనిగా పాడిన మొదటిపాట. అప్పటినుంచి నన్ను గాయనిగా గుర్తించారు. అందరూ నటిగా కంటే కూడా గాయనిగా పరిశ్రమలో స్థిరపడాలని సూచించారు. ఆశించారు.నేను పాడిన మొట్టమొదటి ప్లేబాక్ కు భీమవరపు నరసింహారావు (అందరూ బి.ఎన్.ఆర్. అనేవారు) సంగీతం సమకూర్చారు.

నేను పాడిన రెండవపాట మాయామశ్చీంద్ర చిత్రం కోసం బి.ఎన్.ఆర్.స్వరం చేసిందే. 'వినవోయి హృదయాలాపన' అనే పాట కూడా అందరినీ ఎంతగానో అలరించింది. చెంచులక్ష్మి బాగా హిట్ కావడంతో సి.ఆర్.సుబ్బరామన్ సంగీతం సమకూర్చగా 1940లో గూడవల్లి రామబ్రహ్మం దర్శకత్వం వహించిన "ఇల్లాలు" చిత్రంలో సాలూరి రాజేశ్వరరావుగారితో నటించి... పాటలు పాడే భాగ్యం కలిగింది. అప్పటినుంచి నేను, రాజేశ్వరరావు గారు కలిసి ఆకాశవాణి , హెచ్.ఎం.వి. రికార్డ్స్ కోసం ఎన్నో డ్యూయెట్స్ పాడడంతో మాకు మంచి పేరు లభించింది. ఈ విధంగా రాజేశ్వరరావు గారితో పరిచయం అయినప్పటినుంచి ఆయన సంగీతం సమకూర్చగా నేనుపాడిన 'కలగంటి', 'పాటపాడుమా కృష్ణ' అనే పాటలు విశేష ప్రజాదరణ పొందాయి. ఈ పాటలను నేను ఆకాశవాణిలో గానం చేశాను. ఇదే పాటలను హెచ్.ఎం.వి.గ్రామఫోన్ రికార్డ్స్‌కోసం రాజేశ్వరరావు గారు స్వయంగా గానం చేశారు. వారు ట్యూన్ చేసి నేను పాడిన 'బంగారు పాపాయి',ఆ తోటలోన ఒకటి', 'శశివదనము', అనే ప్రైవేట్ పాటల రికార్డ్స్ చాలా పేరు తెచ్చి పెట్టాయి. అలాగే మేం ఇద్దరం కలిసి గానం చేసిన యుగళగీతాలు "కోపమేల రాధ', 'తుమ్మెద', 'కోయిల' ఆరోజుల్లో చాలా పాపులర్ అయ్యాయి. 1942-43 లో సి.ఆర్.సుబ్బరామన్ హెచ్.ఎం.వి గ్రామఫోన్ కంపెనీలో మ్యూజిక్ కంపోజర్‌గా ఉన్నప్పుడు ఆయన మొదటిసారిగా సంగీత దర్శకత్వం వహించి నాతో 'తలుపు తీయనంతలోన' అనే గీతాన్ని పాడించారు. అది హిట్ అయింది.

1945లో కె.వి.మహదేవన్ హెచ్.ఎం.వి.కంపెనీ కంపోజర్‌గా పనిచేశారు. వారు కంపోజ్ చేయగా 'ఆలయమున వినపడునదిగో' అనే గీతం కర్నాటక బాణీ రాగమాలికలో సమకూర్చి రికార్డ్ చేశారు. అప్పటి నుంచి మహదేవన్ మ్యూజిక్ చేసిన ఎన్నో చిత్రాలలో నేను పాటలు పాడాను.

అదే సంవత్సరం సాలూరి హనుమంతరావు 'రాధిక' చిత్రం కోసం కంపోజ్ చేయగా నేను పాడిన 'గోపాలకృష్ణుడు నల్లన' అనే పాట ఈ రోజుకు చిరస్థాయిగా నిలిచిపోయింది. తరువాత ఆయన సహకారంతో ఆకాశవాణిలో ఎన్నో పాటలను పాడాను.

సుసర్ల దక్షిణామూర్తిగారు సంగీతం చేసిన 'వీరకంకణం' సినిమా పాటలు, ప్రైవేటు ఆడియో పాటలు బహుళ ప్రజాదరణ పొందాయి. మాస్టర్ వేణు పెద్దరికాలు చిత్రంలో 'లాలి నను కన్నయ్య' అప్పట్లో గొప్ప హిట్.

అశ్వత్థామ సంగీత దర్శకత్వం వహించిన చిన్నకోడలు చిత్రం కోసం నేను పాడిన 'జోజో వయ్యారి కదే" మంచి కంపోజిషన్ బాగా పాపులర్ అయింది.

పెండ్యాల నాగేశ్వరరావు గారు కంపోజ్ చేసిన 'సృష్టిలో తీయనిది స్నేహమేనోయి' అనే పాటను నేను పాడటం జరిగింది. ఈ పాట రిలీజ్ అయ్యాక నాకేకాకుండా పెండ్యాల గారికి మంచి గుర్తింపు తీసుకువచ్చింది. బాగా హిట్ కావడంతో పెండ్యాల గారు సంగీత దర్శకులుగా చిత్ర పరిశ్రమలో స్థిరపడ్డారు.

నాకు చాలా కాలంగా బలీయమైన కోరిక ఉండేది. నౌషాద్ సంగీత దర్శకత్వంలో పాడాలని. అదృష్టం కొద్దీ అనుకోకుండా వారే బొంబాయి నుంచి పిలిపించారు. హిందీ, తమిళ భాషల్లో నిర్మించిన 'ఉడన్‌కటోలా' చిత్రానికి ఆయన సంగీత దర్శకత్వం వహించగా 'వానరథం' పేరుతో అదే చిత్రాన్ని తమిళంలో నిర్మించారు. తమిళంలో నేను పాడగా హిందీలో లతామంగేష్కర్ గానం చేశారు. ఆ విధంగా నా కోరిక ఫలించింది.

1950లో 'దేవదాస్' రికార్డింగ్ జరుగుతుండగా సి.ఆర్. సుబ్బరామన్ మరణించారు. ఆయన లేని లోటును ఎం.ఎస్.విశ్వనాథన్ ఎంతో చక్కగా భర్తీ చేసి ఎటువంటి అంతరాయలు లేకుండా పూర్తి చేశారు. ఆ చిత్రంలో నేను పాడిన మూడు పాటల్లో 'మువ్వగోపాల' అనేది నాకు నచ్చిన పాట. పూర్తి స్థాయి కర్ణాటక సంగీత బాణిలో రాగమాలికగా రూపొందించిన ఈ పాటతో పాటు 'ఇంత తెలిసి యుండి ఈ గుణమేలరా', 'తానే మారెనా' అనే పాటలు ఇప్పటికీ అందరూ ఇష్టంగా వింటూనే ఉన్నారు. ఎం.ఎస్.విశ్వనాథన్ మళ్ళీ 'తెనాలి రామకృష్ణ' చిత్రం కోసం 'ఝుణఝుణ కంకణములూగ' అనే పాటను హిందూస్తానీ శైలిలో ట్యూన్ చేశారు. అటు కర్ణాటక, ఇటు హిందూస్తానీ సంగీతాలలో నిష్ణాతులైన విశ్వనాథన్ ఏ పాట చేసినా దేనికదే ఎంతో చక్కగా ఒదిగిపోతాయి. రమేష్‌నాయుడు మొదటసారిగా మద్రాసు వచ్చినపుడు 'దాంపత్యం' సినిమా ద్వారా పరిచయం అయ్యారు. ఆ చిత్రంలో పాటలన్నీ నేనే పాడాను. నేను నేపథ్య గాయకురాలిగా గానం చేసిన ఆఖరి పాటకు సంగీతం సమకూర్చింది కూడా రమేష్ నాయుడే. 'సంఘం చెక్కిన శిల్పాలు' చిత్రం కోసం 'పోయి రావే అమ్మ' అనే పాట ద్వారా నేను రిటైర్ అయ్యాను. అట్లా ఆయన మ్యూజిక్‌తోనే నేను విరమి ంచాను.

ఆలత్తూరు సోదరులలో ఒకరైన ఆలత్తూరు సుబ్బయ్య వద్ద కర్నాటక సంగీతం నేర్చుకున్నాను. బొంబాయికి చెందిన ప్రముఖ సంగీత దర్శకుడు వసంత్‌దేశాయ్ నాకు హిందూస్థానీ సంగీతం నేర్పారు. అలాగే కొంతకాలం డేవిడ్ గారి వద్ద పియానో నేర్చుకున్నాను. ఈ రకంగా ఏ బాణీలోసమకూర్చిన పాటనైనా సునాయాసంగా పాడగలిగే శక్తి నాకు ఉండేది. రేడియోలో నేను పాడే లలితగీతాలన్నింటినీ నేను స్వయంగా నాకు తోచిన రీతిలో ట్యూన్ చేసుకుని పాడుతున్నాను.

ప్రస్తుతం వస్తున్నపాటల్లో సంగీత సాహిత్యాల పరంగా గుర్తింపు పొందే సత్తాలేదు. వాటిని గూర్చి చర్చ అనవసరం. ఇప్పుడు రిథమ్‌ను బేస్‌చేసుకుని పాటలను ట్యూన్ చేస్తున్నారు. అర్థంకాని భాషలో తప్పుడు మాటలు పేర్చేసి పాట అంటే సరిపోదు. ప్రజలకు జ్ఞాపకం ఉండడానికి, మళ్ళీ పాడుకోవడానికి అనువుగా ఉండే పాటలు కావలసిన అవసరం ఎంతో ఉంది. ఇంత మందితోపనిచేసిన నేను ప్రస్తుతంఉన్న వారందరిలోను సీనియర్‌ను.ఆ కారణంగానే సంగీతానికి సంబంధించి నన్ను అందరూ గౌరవించే వారు. వారు స్వరం చేసిన పాటలను చిన్న మార్పులతో పాడినా అభ్యంతరం పెట్టేవారు కాదు.

ఈ తరానికి సంబంధించి ఇళయరాజా, ఎ.ఆర్. రహమాన్‌లు చేస్తున్న ప్రయోగాలు ఎంతో బాగున్నాయి. శాస్త్రీయ విలువలు ఎంతమాత్రం దెబ్బతినకుండా వెస్టన్ బీట్స్‌తో మేళవించి మంచిరాగాలను సాహిత్యానికి జోడిస్తున్నారు. అందరూ పాడుకునేటట్లు మంచి పాటలు రావాలనే నా కోరిక.

# 'భక్తి సంగీతం'

- డా॥ సి. ఉమాప్రసాద్.

భక్తి - అనే పదము పవిత్రమైన భావనకి సంబంధించింది. మనషులలో భక్తి భావన కలవారిని 'భక్తులు' అంటారు. వైష్ణవులకు భక్తి ప్రక్రియ విష్ణువు, కృష్ణుడు లేదా అతని అవతారాలకు సంబంధించినది.

అదే విధంగా శైవులకు శివుడు, శక్తి లేదా వారి అవతారాలకి సంబంధించినది. నవరసాలు వొలికి నప్పుడే రాగ, భావ, తాళ విన్యాసాలు తెలుస్తాయి. సంగీతంలోనే కాక, కావ్యాలలో కూడా నవరసాలు ఒటాయి.

భక్తి, శృంగారం, వీరం మొదలైనవి అభిషేక జలాలుగా భావించవచ్చు. కూర్పు పదముల యొక్క కలయిక భక్తి, పుష్పాలుగా చెప్పవచ్చు.

శ్రవణ శుభగమైన మధుర శబ్ద విన్యాసాలు మంగళ నినాదాలుగా, ఉపమా, రూపకాది అలంకారాలు శివునికి అర్పించే దివ్య వస్త్రాలుగా, కవితా సౌందర్యం శివునికై వెలిగించే దీపకాంతులుగా, కావ్యగతమైన మాధురీ మహిమ యే భగవంతుని నైవేద్యంగా భావించే వాగ్గేయ కారులెందరో!.

భక్తి మార్గాలను మనశాస్త్రాలు నిర్దేశించాయి. భగవంతుని వైభవం వినడంవల్లనైనా ఆయనను కీర్తించడం వల్లనైనా, మననం చేసుకోవడం వల్లనైనా, ఆయన పాదాలను సేవించుకోవడం వల్లనైనా, అర్పించుకోవడం వల్ల నైనా, వందనాలు అర్పించు కోవడం వల్లనైనా దేవ దేవునికి దాస్యం చేయడం వల్లనైనా, ఆయనతో సఖ్యతతో మెలగడంతోనైనా తుదకు ఆత్మ నివేదన ద్వారా నైనా భక్తజనులు పునీతులు కావచ్చు అని మహర్షులు ఉద్ఘాటించారు.

రామచంద్ర మూర్తి ఎడల కూడా అనేకమంది భక్త పుంగవులు నవ విధాలుగా తమ పరమ ప్రేమను ప్రకటించుకున్నారు.

హనుమ, వాల్మీకి మహర్షి, సీతాదేవి, భరతుడు, శబరి, విభీషణుడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, జటాయువు ఇలా ఒక్కొక్కరు ఒకొక్క తీరుగా ఆ తారకరామునికి చేరువయ్యారు.

సత్యం, శివం, సుందరం అయిన భగవత్ స్వరూపాన్ని వర్ణించడానికి, పోలిక చెప్పటానికి అలంకారాలు పదప్రయోగాలు, విశేషార్థాలు, చమత్కారాలు, నవరసాలు మొదలైనవి ఎన్నో. ఎంతో మంది ఈ ప్రయోగాలతో రచనలు చేసినా, ప్రతి వాగ్గేయకారుని యొక్క మానసిక, అంతర్మథనానికి, అనుభవాలకి మధ్య జరిగే సంఘర్షణల ద్వారా రచనలు చేసినప్పటికి దేనికి అందని దైవ స్వరూపాన్ని స్తుతించుట మనిషికి సాధ్యమా? అని స్వగతంలో అనుకుంటారుట.

ఐనా వాగ్గేయకారులు తమ శక్తి కొలది కొలచుట మానరు కదా.

మనిషికి దేవుని వర్ణించడానికి అర్హత లేదని తెలిసినా, అర్హత కొరకు దేవుని సన్నిధికొరకు పరితపించడం, భగవదనుభూతిని పొందుటకు నిరంతరం ప్రయత్నం జరుగూతూనే ఉంటుంది.

'భక్తి' అనేది శక్తివంతమైన మార్గం. సునిశ్చితమైనది, సులభమైనది. నమ్మకమైనది, అమోఘమైనది మరియు తప్పక సఫలం అగునట్టిది. ఇది భక్తునికి 'భక్తి' పై ఉండే విశ్వాసం. 'జ్ఞానీతు ఆత్మైవ మేమతమ్', భక్తి లేని పరాకాష్ట ఆత్మ నివేదనమే. అదే జీవేశ్వర అభేదస్థితి. దానిని సాధించడమే సాధకుడికి పరమావధి. ఆత్మ నివేదనమే 'భక్తికి' పరాకాష్ట. 'నేను' అనే దాన్ని సమర్పి ంచడం కుదరదు. ఎందుకంటే ఇక్కడ రెండు వస్తువులు లేవు. ఇవ్వబడేది (అహం) ఆత్మ. ఇచ్చేవాడు కూడా (అహం) ఆత్మే. రెండు ఒకటే అయినప్పుడు ఇది కుదరదు.

అందుకే సరిగా అర్థం చేసుకోలేని వారు నన్ను నేను భగవంతునికి సమర్పించు కుంటున్నానని భావిస్తువుం టారు.

'ఆత్మశుద్ధ చైతన్యం' అది నేను అని స్ఫురించే అఖండమైన స్వరూపం. అది జడ వస్తువు కాదు. ఆత్మ నివేదన మంటే ఆత్మతత్త్వ జ్ఞానాన్ని పొందడమే. ప్రాపంచిక (విషయ) వస్తువులపై కలిగిన వైరాగ్యం ద్వారా కూడ బెట్టిన శారీరక మానసిక శక్తులను ఆధ్యాత్మిక వికాసానికి ఉపయోగించినప్పుడే వాటికి సార్థకత కలుగుతుంది.

పవిత్రమైన మనస్సు ఆత్మసాక్షాత్కారం కల్గిస్తుంది. అలాంటి స్థితిని పొందిన మహనీయు సంగీత వాగ్గేయకారులెందరో అందరు 'భక్తి – ముక్తి' మార్గానికి బాటవేసి చూపారు. అందరిని మనం స్మరించుకోవడం మన బాధ్యత.




**త్యాగరాజ గాన సభ, హైదరాబాద్.**

వంశీ రామరాజు ట్రస్ట్ వారి నిర్వహణలో శ్రీ చౌటి రఘునందన్ గాత్రసభ (అసిస్టెంట్ డైరక్టర్ సాంస్కృతిక శాఖ), కీబోర్డు సహకారము శ్రీ శ్రీనివాస యాదవ్, మృదంగ సహకారము శ్రీ ఏడిద భీమశంకర్; తబల, మోర్సింగ్ సహ కారము శ్రీ జయకుమార్ ఆచార్య.




**కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్–త్యాగరాయ గానసభ**

డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతి సంగీత స్వర నీరాజనంలో 6.7.22న గానం చేసిన డా॥ వై. రమాప్రభ. శ్రీ కోలంక సాయి వయెలిన్ ; శ్రీ పి.వి.రమణమూర్తి మృదంగం.

ఈ కార్యక్రమానికి తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥ కె.వి.రమణ ముఖ్య అతిధిగా విచ్చేయగా డా॥ సముద్రాల వేణుగోపాలచారి అధ్యక్షత వహించారు. గౌరవ అతిధి శ్రీ కళా జనార్థమూర్తి.

# నిన్నే భజన - నాట

- ఆలమూరు విజయభాస్కర్

## ఉపోద్ఘాతము :

రసమంటే ఏమిటి? అని తెలుసుకొన ప్రయత్నించే నా వంటి సామాన్యులకు, ఈ విషయమును తెలిపే నాట్యశాస్త్రము, రసగంగాధరము, కావ్య ప్రకాశము, కావ్యాలంకార సంగ్రహము వంటి గ్రంథములు తెలుగులో వ్రాసియున్ననూ చదివి అర్థము చేసికొనుటకు అసంభవము.

ఎందుకంటే, ఆ గ్రంథములలోని సూత్రములను వాటి మర్మములను గ్రహించుటకు మనకు సరియైన ఉదాహరణలు కావలెను. కాని వందల, వేల సంవత్సరముల క్రితం వ్రాయబడిన ఈ గ్రంథములలో నాటి కాలమునకు చెందిన కావ్యములనుండి తీసుకొనబడిన ఉదాహరణలు నా వంటి వారికి దుర్గ్రాహ్యము.

నావంటి వారి పరిస్థితిని గ్రహించి, మమ్ము కరుణించియే, త్యాగరాజస్వామి రససూత్రములు మాకు అర్థమయ్యేరీతిలో, తమ కృతులను రచించారని నాకు అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది.

వీరరసమంటే ఏమిటి అది ఎలా ఉంటుంది అని ఆలోచిస్తే, నాకు 'నిన్నే భజనసేయువాడను' అని నాటరాగంలో స్వామివారు వ్రాసిన కృతి స్ఫురిస్తుంది.

నాట్యశాస్త్రములో భరతముని వీరరసాన్ని ఈ క్రింది విధంగా నిర్వచిస్తారు.

**'ఉత్సాహాధ్యవసాయదవిషాదిదవిస్మయామోహాత్**

**వివిధార్థ విశేషాద్వీరరసో నామసంభవతి'.**

అనగా ఉత్సాహము, అధ్యవసాయము (తాను ఏది పొందదలచెనో దానిని తప్పక పొందవలెనన్నదృఢనిశ్చయము), అవిషాదము (దుఃఖము) లేకుండుట, అవిస్మయము (ప్రతీ చిన్న విషయానికీ ఆశ్చర్యపడకుండుట), అసమ్మోహము (ఏమి చెయ్యాలో తెలియని స్థితి లేకుండా ఉండడం) అనే విశేషాలనుండి వీరరసముద్భవిస్తుంది.

లాక్షణికులు ఈ వీరరసములో ధర్మవీరము, దానవీరము, దయావీరము, యుద్ధవీరము అను నాలుగు వైవిధ్యాలను సూచించారు. త్యాగరాజస్వామి ఈ కృతిలో భక్తివీరము అనే మరో ప్రత్యేకతను దర్శింప చేసారని నేను భావిస్తాను. ఈ కృతిలో ఆయన తన లక్ష్యమును, దానిని ప్రసాదించగలవారిని, వారిని ప్రసన్నము చేసుకొను మార్గమును, ఆ మార్గమునే ఎంచుకొనుటకు తన కారణములను వివరిస్తున్నారు. అంతేకాదు త్యాగరాజస్వామి ఈ విషయములను ముగ్గురికి తెలుపుతున్నారు.

1. తన మనస్సుకు 2. తను ఆరాధించే శ్రీరామునికి 3. పరోక్షంగా నాకు, నా వంటి వారికి.

ఇప్పుడు ఈ కృతి యొక్క విశిష్టతని పరిశీలిద్దాం.

**ప.** నిన్నే భజన సేయువాడను

**నిన్నే :**

ముందు చెప్పుకున్నట్లు, త్యాగరాజకృతులలోని మొట్టమొదటి పదము ఆయన హృదయభావాన్ని తెలిపేందుకు ఆయన ప్రయోగించే అద్భుతమైన నమస్కారబాణము.

ఇక్కడ త్యాగరాజస్వామి, తన ఆరాధ్యదైవాన్ని ఎన్నుకుని, "రామా" నిన్నేపూజిస్తానని ఆయనకు చెప్పుకుంటున్నారు.

**భజన సేయువాడను**

అంతేకాదు, నవవిధ భక్తిమార్గములలో 'కీర్తనం' అను మార్గమును తాను రాముని ప్రసన్నుని చేసుకొనుటకు ఎన్నుకున్నానని విన్నవిస్తున్నారు.

ఈ పల్లవిలో త్యాగరాజస్వామి ఉత్సాహమునూ, దానితోపాటు అసమ్మోహమునూ అనగా తను ఎన్నుకున్న మార్గం పట్ల స్పష్టతనూ కనబరుస్తున్నారు.

ఇంకనూ, "ఆది నాట అంత్య సురటి' అని సంగీతకచేరీ లలో రససిద్ధికై చెప్పినట్లు, త్యాగరాజస్వామి ఈ కృతికి నాట రాగాన్ని ఎంచుకోవడంలో మంచి చాతుర్యం చూపించారు. ఎందుకంటే, ఏదైనా కార్యాన్ని ఆరంభించేటప్పుడు, సాధకునికి కావలసిన ఇంధనాలు ధృడనిశ్చయమూ, ఉత్సాహమూనూ. ఇవి నాటరాగంలో పుష్కలంగా దర్శింపగలము.

ఇక్కడ ఈ కృతితో నాకు కలిగిన అద్భుతమైన అనుభవాన్ని మనవి చేసుకుంటాను....

సుమారు 20 సంవత్సరాలక్రితం, పూనాలో విదుషి శ్రీమతి తులసీ విశ్వనాథ్ గారి కచేరీకి వెళ్ళడం తటస్థించింది. చాలా దూరం ప్రయాణించి, కచేరీ మొదలయ్యాక హాలు చేరుకున్నాము. మేము కూర్చోగానే ఆమె 'నిన్నే భజన' కృతి పాడడం మొదలు పెట్టారు.

ఇంతకుముందు నేను ఈ కృతిని ఎప్పుడూ వినలేదు. 'నిన్' అని మొదలుపెట్టగానే, దాని వెనుకనున్న అంతరగాంధారం యొక్క నాదం నన్ను పరవశుణ్ణి చేసి, ఒక అద్భుతమైన నాదానుభవాన్ని కలుగజేసింది. ఇప్పటివరకూ ఆ నాదం నా హృదయంలో మారు మ్రోగుతూనే ఉంది. విచిత్రమేమిటంటే, ఆ పాట తరువాత ఆమె పాడిన పాటలేవీ నాకు గుర్తులేవు. అది మాత్రం నా హృదయంలో ఆజన్మాంతమూ నిలచి ఉంటుంది....

**అ.** పన్నగశాయీ పరుల వేడలేను (ని)

**పన్నగశాయీ**

ఆదిశేషునిపై పడుకున్నవాడా అని సంబోధిస్తున్నారు త్యాగరాజస్వామి ఇక్కడ. నా ప్రార్థనను పట్టించుకోకుండా హాయిగా పడుకున్నవాడా అని రామునిపై ఇది ఒక వ్యంగ్యాస్త్రం.

**పరుల వేడలేను**

అంటే రామా నీవు నా ప్రార్థనలను నిర్లక్ష్యముచేస్తూ హాయిగా నిద్రిస్తున్నా, నేను హతాశుడనై వేరొకరివద్దకు పోను సుమా, అని నొక్కి చెపుతున్నారు.

ఈ అనుపల్లవిలో త్యాగరాజస్వామి తన అధ్యవసాయమును (తాను దేనిని పొందదలచినాడో దాని పట్ల ధృఢనిశ్చయాన్ని), అవిస్మయమునూ, అవిషాదమునూ, అంటే, రాముడు తనపట్ల నిర్లక్ష్యం చూపిస్తే, దానికి ఆశ్చర్యపోకుండా, దుఃఖించకుండా నిరంతర ప్రయత్నం చేస్తానని రామునికి చెపుతున్నారు.

**చ.** స్నానాది జప తప యోగ ధ్యాన సమాధి సుఖప్రద
సీతానాథ సకలలోకపాలక త్యాగరాజసన్నుత (ని)

**స్నానాది జపతపయోగ ధ్యానసమాధి సుఖప్రద**

స్నానాది జపతపయోగ ధ్యానసమాధులు అన్నిటి వలన కలిగే సుఖమును కేవలం నీ నామస్మరణవల్లనే ప్రసాదించ గలిగినవాడా అని స్తుతి.

**సీతానాథ**

లోకపావనీ, కరుణామయీయైన సీత యొక్క నాథుడా అని సంభోధన

**సకలలోకపాలక**

అన్ని లోకములనూ పాలించేవాడా అని స్తుతి

**త్యాగరాజ సన్నుత**

త్యాగరాజుచే నుతింపబడినవాడా అని స్తుతి.

ఈ చరణంలో త్యాగరాజస్వామి రామునే ఎందుకు పూజించా లనుకుంటున్నారో వివరిస్తున్నారు.

రామనామజపము ఒక్కటే స్నానజప తపయోగ ధ్యాన సమాధుల ద్వారా పొందగలిగిన సుఖాన్నివ్వగలదనియూ, సీతానాథా, సకలలోకపాలకా అనే సంబోధనలు రాముని యొక్క ఔన్నత్యాన్ని చాటిచెప్తూ, తద్వారా స్వామి వారు రామునే ఎందుకు లక్ష్యముగా ఎన్నుకున్నారో వివరిస్తున్నారు.

అంతేకాదు, తనలక్ష్యమైన మోక్షసిద్ధికై, మరొకసాధనముగా సంగీతాన్ని తీసుకున్నారు.

**త్రివర్గఫలదాస్సర్వే దాన యజ్ఞ జపాదయః**

**ఏకం సంగీత విజ్ఞానం చతుర్వర్గ ఫలప్రదం**

ఈ సూక్తిననుసరించి దానములు, యజ్ఞములు మొదలైనవి ధర్మార్థకామములను మాత్రమే ప్రసాదించగలవు. కాని సంగీతం ధర్మార్థకామమోక్షములనే నాలుగు పురుషార్థములనూ ప్రసాదించగలదు.

కావున త్యాగరాజస్వామి మోక్షార్థియై, సకలపురుషార్థ ప్రదాతయైన రామునే ప్రార్థించుటకు నిశ్చయించుకొని, సకల పురుషార్థములనూ సిద్ధింపజేయగల సంగీతముతో నవవిధ భక్తిమార్గములలో తనకు ప్రీతికరమైన కీర్తనం అనే మార్గాన్ని ఎంచుకుని, ధృఢనిశ్చయంతో, ఉత్సాహంతో, రాముడు అనుగ్రహించు వరకూ అవిషాదముతో నిరంతరమూ కృషిచేస్తానని రామునికి తెలుపుకుంటున్నారు.

ఇటువంటి భక్తునకు, అతని కోరికకు త్యాగరాజనుతుడు తథ్యము పల్కుటలో ఆశ్చర్యమేమున్నది?

# పాల్‌ఘాట్ శ్రీ.టి.ఎస్.మణి అయ్యర్

**- శ్రీ,కె.సద్గురు చరణ్**



1924లో మద్రాసు జగన్నాథ భక్తసభ ఆధ్వర్యంలో ప్రముఖ గాత్ర విద్వాంసులు శ్రీ చెంబై వైద్యనాథ భాగవతార్ గారి కచేరి ఏర్పాటైంది. సుప్రసిద్ధ విద్వాంసులు మైసూర్ టి.చౌడయ్యగారు వయోలిన్‌పై, పుదుక్కోట్టై దక్షిణామూర్తి పిళ్ళై గారు కంజీరాపై, సుందరం అయ్యర్‌గారు ఘటంపై, సీతా రామయ్యర్ గారు మోర్సింగ్‌పై సహకరించడానికి విచ్చేశారు. మృదంగంపై ఎవరు సహకరిస్తారో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తనకు మృదంగంపై సహకరించడానికి పన్నెండేళ్ళ కుర్రాణ్ణి తీసుకొచ్చారు చెంబైగారు. ఇది చూసిన శ్రోతలు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. నిర్వాహకులు భయపడ్డారు. ఎంతో ఉదృతంగా సాగే చెంబై గారి పాటననుసరించడానికి ఎంతో ప్రజ్ఞ, సాధన, భుజబలం అవసరం. మరి ఇంత చిన్న కుర్రాడు ఎలా అనుసరిస్తాడు? దానికి తోడు చెంబై గారికి సహకారం అందించడానికి వచ్చిన మిగిలినవారందరూ ఎంతో అనుభవజ్ఞులైన మహావిద్వాంసులు. మృదంగ కళాకారుణ్ణి మార్చడానికి వీల్లేదని నిర్వాహకులకు చెప్పారు చెంబై గారు. కచేరి రసాభాస అవుతుందేమోనని కంగారు పడ్డారు నిర్వాహకులు. ఎందుకైనా మంచిదని శంకర్ మీనన్ అనే మృదంగ విద్వాంసుని సిద్ధంగా ఉంచారు. అయితే అందరి అనుమానాలను పటాపంచలు చేస్తూ గంగాప్రవాహం వంటి చెంబైగారి పాటకి ముగ్గురు హేమాహేమీలైన ఉపప్రక్కవాద్యాలతో కలిసి సమర్థవంతంగా సహకారం అందించాడా కుర్రవాడు. అతని వాద్యాన్ని విని ఎంతో ఆనందించిన జలతరంగం రమణయ్య చెట్టియార్ గారు ఆ కుర్రవాడికి ఒక పతకాన్ని బహూకరించారు. ఆ తర్వాతి రోజుల్లో చెంబైగారితో కొన్ని వందల కచేరీలు వాయించి హిమాలయాలంత ఎత్తుకు ఎదిగాడా కుర్రవాడు. అపర నందీశ్వరునిగా కీర్తించబడ్డాడు. ఆయనే పద్మభూషణ్, 'సంగీత కళానిధి' పాల్‌ఘాట్ శ్రీ టి.ఎస్.మణి అయ్యర్ గారు. చెంబై గారిది అమృతహస్తం, విశాల హృదయం. ఆయన తనతో వాయింపించుకుని, ఆశీర్వదించి, ప్రోత్సహించిన యువ కళాకారులెందరో నేడు అత్యున్నత శిఖరాలను అధిరోహించారు.

మణి అయ్యర్‌గా సంగీతలోకానికి పరిచితులైన వీరి అసలు పేరు రామస్వామి. శ్రీ టి.ఆర్.శేషభాగవతార్, ఆనందాంబాళ్ పుణ్య దంపతులకు 1912, జూన్ 12న జన్మించారు మణి అయ్యర్ గారు. కేరళలోని పాల్‌ఘాట్ వద్ద గల తిరువిల్వామలై అనే ఊళ్ళో వీరు నివాసం ఉండేవారు. అయిదవ తరగతిలోనే స్కూల్ చదువు మానేసిన ఆయన ముందుగా పాల్‌ఘాట్ సుబ్బయ్యర్, అనంతరం కల్పాతి విశ్వనాధయ్యర్ గార్ల వద్ద మృదంగ విద్యను అభ్యసించారు. ఈ రోజుల్లోనే ఒకసారి శివరామకృష్ణగారనే ఒక ప్రముఖ భాగవతార్‌గారి హరికథకు మృదంగ విద్వాంసుడు రాకపోతే విశ్వనాధయ్యర్ గారు కాసేపు వాయించి, శ్రోతల్లో కూర్చుని ఆసక్తిగా వింటున్న మణిని పిలిచి మిగిలిన కథకు వాయించమన్నారట. అదే మణిగారి మొదటికచేరీ. అక్కడ్నించి వెనుదిరిగి చూడలేదు. మణిగారు ఆ తర్వాత శివరామకృష్ణగారికి ఎన్నో కథలకు సహకరించారు. తండ్రిగారి గాత్ర కచేరీ లెన్నింటికో కూడా సహకారం అందించారు.

మరి కొద్దిరోజుల్లోనే చెంబైలో చెంబై వైద్యనాథ భాగవతార్ గారితో చేసిన కచేరీ ఆయన జీవితాన్ని ఒకగొప్ప మలుపు తిప్పింది. మణి గారి వాయిద్యాన్ని విని ఎంతో ఆనందించిన చెంబైగారు తనతో కలకత్తా, వారణాసివంటి నగరాలలో కచేరీలకు తీసుకెళ్ళారు. 12సంవత్సరాల పిన్న వయస్సులో జగన్నాథ భక్త సభ ఆధ్వర్యంలో తనతో వాయింపించి మద్రాసు

శ్రోతలకు పరిచయం చేసారు. మణిగారి 14వ యేట మద్రాసు మ్యూజిక్ అకాడమీకి ఆయనే పరిచయం చేసారు. పదిహేనవయేట ప్రముఖ మార్దంగికులు తంజావూరు వైద్యనాథయ్యర్‌గారి పరిచయభాగ్యం కలిగింది. వారి వద్ద శిష్యరికంలో మేలుజాతి వజ్రంగా రూపొందారు.

కీర్తనలకు అనుసరణ చెయ్యడంలో మణిగారిది విలక్షణమైన శైలి. మణిగారికి పూర్వం కృతులకు సర్వలఘు నడకలతో, చిన్న చిన్న ముగింపులతో అనుసరణ చేసేవారు. అయితే ఈ సాంప్రదాయానికి విభిన్నంగా కీర్తనలలోని సంగతులే కాకుండా మనోధర్మ అంశాలైన నెరవల్, స్వరకల్పనలను కూడా గాయకునితో పాటు పాడుతున్నట్లు వాయించే ఒక అనితర సాధ్యమైన శైలిని ఆయన సృజించారు. కచేరీలో మృదంగం విడిగా వినిపించకుండా పాటతో కలిసిపోయేది. తర్వాతి తరాల మార్దంగికులను ఏదైనా కృతికి అనుసరణ ఎలా చెయ్యాలి అంటే మణి గారి శైలిని ప్రామాణికంగా తీసుకునే స్థాయికి చేరింది ఆయన బాణి. కేవలం అనుసరణే కాకుండా కచేరీలో ఆయన వాయించే తని ఆవర్తనాన్ని వినడానికి ఎంతోమంది శ్రోతలు చివరకంటా కూర్చుకునేవారు. మణి అయ్యర్‌గారి మృదంగ సహకారం అంటే ప్రధాన కళాకారులెవరనే దానితో సంబంధం లేకుండా తండోపతండాలుగా జనం వచ్చేవారు. తని ఆవర్తనాన్ని విరామ సమయంగా భావించే స్థితి నుండి కేవలం తని ఆవర్తనం వినడం కోసమే వచ్చే స్థాయికి శ్రోతలను తీసుకువచ్చారు మణిగారు. వర్ధిష్ణు కళాకారులెందరో ఒక్కసారి మణిఅయ్యర్‌గారి సహకారంతో కచేరీ చేస్తే చాలు తమ జన్మ తరిస్తుందని అనుకునేవారట. ఒకసారి తిరుచ్చిలో మణిఅయ్యర్ గారి సహకారంతో అలత్తూర్ సోదరుల కచేరీ జరిగిందట. అప్పట్లో కచేరీలన నిడివినాలుగునుండి ఆరుగంటల వరకు ఉండేది. కచేరీలో రెండు తని ఆవర్తనాలు ఉండేవి. మొదటి తని ఆవర్తనం ఇవ్వగానే మణిగారు అద్భుతంగా, ఉధృతంగా వాయించారట. తని ఆవర్తను పూర్వవగానే అలత్తూర్ సోదరుదు శ్రోతలతో ఇంత బ్రహ్మాండమైన తని ఆవర్తనం విన్నాక ఇక మళ్ళీ మేం పాడడం బాగుండదు. ఈ అద్భుతమైన వాద్యం యొక్క మధురానుభూతితోనే మీరు ఇళ్ళకు వెళ్తే బాగుంటుంది. మేం మరోసారి వచ్చి పాడతాం" అన్నారట. అదీ మణి అయ్యర్ గారి వాయిద్యానికుండే శక్తి. అలత్తూర్ సోదరుల గొప్ప మనసు కూడా అభినందనీయం. అనుసరణీయం. పాల్‌ఘాట్ శ్రీ టి.ఎస్.మణిఅయ్యర్, పళని శ్రీ సుబ్రమణ్య పిళ్ళై, రామనాథపురం శ్రీ సి.ఎస్.మురుగుభూపతి – వీరి ముగ్గురినీ 'మృదంగ త్రయం' గా చెప్తూ ఉంటారు. అందులోనూ మణి అయ్యర్ గారి పేరే మొదట చెప్తారు. ఆకాశవాణిలో ప్రధాన కళాకారుడు, సహకారాలు అన్న భేదం లేకుండా ఎవరికైనా వారి ప్రతిభ ఆధారంగా ఇచ్చే గ్రేడ్ బట్టి మాత్రమే పారితోషికం ఇవ్వాలని అప్పటి ఆకాశవాణి డైరక్టర్ జనరల్ నాయర్ గారిని ఒప్పించారు. వేదికపై ఉండే విద్వాంసులందరి సంఘటిత కృషివల్లనే కచేరీ రక్తి కడుతుందనీ, ఇక్కడ ఎక్కువ తక్కువల ప్రసక్తి ఉండదనీ వారి నిశ్చితాభిప్రాయం. అదే నిజం కూడా.

సర్వశ్రీ చెంబై వైద్యనాథ భాగవతార్,మహారాజపురం విశ్వనాథయ్యర్, కాంచీపురం నయనా పిళ్ళై, ముసిరి సుబ్రహ్మణ్యయ్యర్, అరియకుడి రామానుజయ్యంగార్, మధురై మణి అయ్యర్, జి.ఎన్.బాలసుబ్రహ్మణ్యం, సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్, అలత్తూర్ సోదరులు, పాపా వెంకట్రామయ్యర్, మైసూర్ టి.చౌడయ్య, ద్వారం వెంకటస్వామి నాయుడు, టి.ఆర్.మహాలింగం వంటి ఎందరో 20వ శతాబ్దపు మహావిద్వాంసులతో వారుచేసిన కచేరీలు శ్రోతల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయాయి.పుదుకొట్టైదక్షిణామూర్తి పిళ్ళై, పళని సుబ్రహ్మణ్య పిళ్ళై వంటి గొప్ప మార్దంగికుల – కంజీరా సహకారంతో వారు వాయించిన లయవిన్యాసాలు విద్వాంసులకు ఆలోచనాత్మకంగా, పామరులకు వీనులవిందుగా వుండేవి. చెంబైగారి దురిత కాల స్వరకల్పనలకు, ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్‌గారి ఆర్ద్రతతో కూడిన విలంబకాల కృతులకు, అలత్తూర్ సోదరులు గానం చేసే క్లిష్టమైన స్వరకల్పనలకు, మేధస్సుతో కూడిన అనేక గతిభేద పల్లవులకు ఆయన చేసిన అనుసరణ అనన్యసామాన్యమైనది. సంగీతం నేర్చుకుంటే గణితంపై చక్కటి పట్టు వస్తుందనే సిద్ధాంతానికి ఐదవతరగతిలో చదువు మానేసిన మణిఅయ్యర్‌గారు ఒక అద్భుతమైన ఉదాహరణ. ఊహాతీతమైన సెమ్మంగుడిగారి స్వర ప్రస్తారాలను అందిపుచ్చుకోవడంలో ఆయనది అందె వేసిన చేయి. ఎంతో రక్తిగా సాగే మధురై మణి అయ్యర్ గారి స్వరప్రస్తారాలను మృదంగంపై పాడించే వారాయన. గాయకుని మనోధర్మాన్ని 'రియల్ టైం' లో అందుకోగలగడం ఆయనకు భగవంతుడిచ్చిన వరం. తని ఆవర్తనం

అనేది మార్దంగుకుని ఆలాపన అనీ, అది కృతి యొక్క పొడిగింపు మాత్రమే తప్ప విడిగా వాయించడం కాదనీ అనేవారు. అందుకే వారు వాయించిన లయవిన్యాసాలతతో విధిగా ఒక కృతికి కొద్దిగా సహకారం వాయించిన తర్వాతే తని(విడి)గా వాయించేవారు.



**మణి అయ్యర్‌గారితో మృదంగ నిర్మాణ నిపుణుడు ఫెర్నాండెస్**

ఇక వారు మృదంగం తయారు చేయించుకునే విధానం గురించి చెప్పుకోవడం చాలా అవసరం. వారి ముఖ్య శిష్యులలో ఒకరైన శ్రీ వి.కమలాకరరావు, తదితరులు రచయితతో చెప్పిన విశేషాలను కొన్నింటికి పాఠకులకు తెలియచేస్తాను. వారి ఇల్లు ఒక కార్ఖానాలాగా ఉండేదట. ఒక పక్క కొందరు పనివారు మృదంగం గుల్లలు దొలుస్తూ ఉంటే మరికొంతమంది మూతలు కుడుతూ లేదా కరిణ వేస్తూ ఉండేవారట. వారి వద్ద దాదాపు వంద మృదంగాలు ఉండేవట. మృదంగం యొక్క ఎత్తు, కుడి ఎడమల వ్యాసాలను బట్టి ఏ కొలతలతో ఉండే మృదంగం ఏ శృతికి బాగుంటుందో ప్రయోగాలు చేసేవారు. కరిణ వేసిన తర్వాత నాటు, మీటు చాలా జాగ్రత్తగా సర్దేవారు. బయట వాతావరణాన్ని బట్టి కచేరీ ఆడిటోరియం ఎయిర్ కండిషన్డా కాదా అనేదాన్ని బట్టి మృదంగం యొక్క కుడి ఎడమలను సర్దుకునేవారు. తేమ, శీతోష్ణాల ప్రభావం మృదంగం వంటి చర్మ వాద్యాలపై చాలా ఎక్కువ ఉంటుంది. ఆయన చేసిన ప్రయోగాలు, వాటి ఫలితాలు తరువాత తరం విద్వాంసులకెంతో ఉపయోగపడ్డాయి.

వారిది విశాల హృదయం. పనివారిని ఎంతో ప్రేమగా చూసేవారు. ఒక పూరిగుడిసెలో ఉండే ఫెర్నాండెస్ కి ఒక పక్కా ఇల్లు కట్టించి ఇచ్చారట మణిగారు. కేవలం శృతిని బట్టి మాత్రమే కాకుండా ఒక్కో గాయకునికి ఒక్కోలా మృదంగం సిద్ధం చేసేవారట ఫెర్నాండెస్ గారు. మృదంగం బాగా కుదిరితే సంతోషం. ధాటిగా ఉండేవారి వాద్యానికి ఒక్కోక్కసారి కచేరీ మధ్యలో కరిణ పోయేదట. అందుకని ఎక్కడ కచేరీ అయినా తనతో పాటు పనివారిని, నాలుగు మృదంగాలను తీసుకెళ్ళేవారట. మృదంగం వార్లు (కుడి ,ఎడమ మూతలను పట్టి ఉంచే పొడవైన చర్మపు తాళ్ళు) వీధిలోకి అమ్మకానికి వస్తే అవసరం లేకపోయినా కొనేవారట. "మనం కొనకపోతే అమ్మేవారెలా బతుకుతార"నే వారట. ప్రముఖ శాస్త్రవేత్త, నోబెల్ పురస్కార గ్రహీత సర్.సి.వి.రామన్ గారు సంగీత వాద్యాల నాదంపై పరిశోధనలు చేయడానికి మణి అయ్యర్‌గారిని తన ప్రయోగశాలకు ఆహ్వానించడం బట్టి వారి మృదంగాల నాణ్యత ఎలా ఉండేదో చదువరులు అర్థం చేసుకోగలరు.

1965 సెప్టెంబరులో ప్రభుత్వ ఆహ్వానం మేరకు వారు లండన్‌లో జరిగిన కామన్వెల్త్ ఉత్సవాలలో, ఎడిన్‌బర్గ్ ఫెస్టివల్ లో పాల్గొన్నారు. ఆయన వాయిద్యం బ్రిటన్ ప్రజలనే కాకుండా యోహూదీ మెనూహిన్ వంటి అంతర్జాతీయ స్థాయి విద్వాంసులను కూడా అబ్బురపరిచింది.

మణి అయ్యర్‌గారిని వరించి ఎన్నో బిరుదులు సార్థకత నొందాయి. ఆయనపొందని గౌరవం లేదు. 1956లో ఆయనకు రాష్ట్రపతి అవార్డు ప్రదానం చేయబడింది. మద్రాసు మ్యూజిక్ అకాడమీ వారి 'సంగీత కళానిధి' బిరుదు, భారత ప్రభుత్వంచే పద్మభూషణ్ పొందిన మొదటి మృదంగ విద్వాంసులు మణి అయ్యర్‌గారు.

ఆయన వద్ద శిక్షణ పొందిన విద్యార్థులలో 'సంగీతకళానిధి' ఉమయాల్‌పురం శ్రీకె.శివరామన్, 'సంగీతకళానిధి' పాల్ఘాట్ శ్రీ ఆర్.రఘు, 'సంగీత విద్యానిధి' శ్రీ వి.కమలాకరరావు మొదలైన వారెందరో ప్రపంచ ప్రఖ్యాతి గాంచారు. వారి కుమారుడు రాజామణి గారు కూడా గొప్ప మృదంగ విద్వాంసులు.

ఆయన వ్యక్తిత్వంలో ప్రధానమైన, నేర్చుకోదగిన విశేషం నిరాడంబరత, ఆయన వస్త్రధారణ చాలా సామాన్యంగా ఉండేది. ఏ విధమైన హంగులు, ఆర్భాటాలు ఉండేవికావు. రాష్ట్రపతి అవార్డు తీసుకోవడానికి కూడా ఆయనతాను ఎప్పుడూ ధరించే సాధారణమైన ఖద్దరు చొక్కా, ఉత్తరీయంతోనే వెళ్ళారు. "అంత గొప్ప అవార్డు అందుకుంటున్న సయంలో ఇంకొంచెం. ఆకర్షణీయమైన వస్త్రాలను ధరించి ఉంటే బాగుండే "దన్న పెద్ద మనిషితో" నాకు ఈ అవార్డు నా వాయిద్యాన్ని బట్టి ఇచ్చేరు

కానీ నా వస్త్రధారణ బట్టి కాదని అనుకుంటున్నాను " అన్నారట.


కచేరీలలో మైక్ ను వాడడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. మృదంగానికి మైక్ పెట్టడానికి ఒప్పుకునేవారు కారు. యావత్ సంగీత ప్రపంచం వ్యతిరేకించినా, ప్రాథేయపడినా ఆయన తనపట్టును వీడలేదు. ఆ సమయంలోనే కొన్నాళ్ళు కచేరీలు వాయించడం తగ్గించేశారు. మైకులు వచ్చాక విద్వాంసులకు పూర్తి సామర్థ్యాన్ని వినియోగించాల్సి అవసరం తగ్గిపోయిందనీ, ఇదికళాకారులలో బద్ధకాన్ని పెంచిందనీ, వీటివల్ల నాదం కృత్రిమతను సంతరించుకుందనీ, చివరకు మైకులు లేకపోతే సంగీతమే లేదనే వరకు పరిస్థితి దిగజారిందని ఆయన అభిప్రాయం. అంతేకాకుండా మైకులు లేనప్పుడు శ్రోతలు నిశ్శబ్దంగా వినేవారనీ, ఇప్పుడు కచేరీ జరుగుతుంటే కబుర్లు చెప్పుకుంటున్నారనీ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

చాలా మందికి తెలియని విషయమేమిటంటే మణిగారు గొప్ప గాత్రజ్ఞులు కూడా. ఒకసారి ఆయన మద్రాసు మ్యూజిక్ అకాడమీలో తోడి రాగంలో ఒక పల్లవిని గూర్చి అద్భుతమైన సోదాహరణ ప్రసంగం చేశారు. త్యాగరాజస్వామి వారంటే ఆయనకు అమితమైన భక్తి. తిరువయ్యారులోని త్యాగరాజ ఆరాధనోత్సవ కమిటీకి కొన్ని సంవత్సరాలపాటు కార్యదర్శిగా పని చేశారు. తన సొంత ఊరైన పాల్ఘాట్లో ప్రతి సంవత్సరం త్యాగరాజ ఆరాధన నిర్వహించేవారు.

ప్రముఖ గాత్ర విదుషీమణి శ్రీమతి డి.కె.పట్టమ్మాళ్ గారి అబ్బాయికి తన కుమార్తెనిచ్చి వివాహం చేశారు. తర్వాత రోజుల్లో ఆడవారికి కచేరీలలో మృదంగ సహకారం అందించకూడదనే తన నియమాన్ని కొద్దిగా సడలించి ఆమెతో కచేరీలు చేసారు.

జీవిత చరమాంకంలో కొంతమంది శ్రేయోభిలాషులసలహాపై ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలోని రిషి వ్యాలీ పబ్లిక్‌స్కూల్‌లో మృదంగాచార్యునిగా తన సేవలను అందించారు. ఆ రోజుల్లోనే ఆయనతో పాటు పనిచేసిన ప్రముఖ గాత్ర విద్వాంసురాలు శ్రీమతి ఎం.ఎస్.వసంతకుమారిగారితో కూడా కొన్ని కచేరీలు చేశారు. తన చివరిరోజుల్లో ఆకాశవాణి కడప కేంద్రంలో ఆయన వాయించిన కచేరీల, లయ విన్యాసాల రికార్డింగులు నేటికీ భద్రంగా ఉన్నాయి.

కేరళలోని ఎర్నాకుళంలో ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 1981, మే 30న విద్వాంసులను, అభిమానులను శోకతప్త హృదయులను గావిస్తూ అవతారం చాలించారు. ఆలయ బ్రహ్మ ఆయనే మరొక అవతారం ఎత్తితే తప్ప ఆయనకు సాటి మరొకరు రాలేరనేది నిర్వివాదాంశం.



# ఇందూరు జిల్లా జానపదులు – పెళ్ళిపాటలు

– శ్రీమతి స్వప్నారాణి తిప్పోల్ల – 9010596828

ఇందూరు ప్రస్తుత పేరు నిజామాబాదైతే పూర్వపు పేరు ఇంద్రపురి. అదే కాలక్రమేణ ఇందూరుగా మారింది. 1905వ సంవత్సరంలో పరిపాలనా విధాన పునర్నిర్మాణ సమయంలో ఇందూరును "నిజాం అసఫ్‌జాహి - VI పేరుతో నిజామాబాద్‌గా మార్చడం జరిగింది. నిజాం అంటే రాజు. అయితే ఇప్పటికీ దీన్ని ఇందూరుగా కూడా పిలుస్తున్నారు..

ఇందూరు జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతం. పసుపు, వరి, చెరుకు, మొక్కజొన్న ఇవి ఇక్కడ ముఖ్యమైన పంటలు. నిజామాబాద్ జిల్లా బహు సంస్కృతుల సమ్మేళనం. సారవంతమైన భూములు విస్తారంగా కలిగిన ప్రాంతం. జిల్లాలో నగర జీవితానికి, గ్రామ జీవితానికి యెంతో వ్యత్యాసం కనిపిస్తుంది. గ్రామాలు జానపద సంస్కృతితో కళకళ లాడుతుంటాయి. పట్టణాలలో కూడా అనువర్తిత జానపద సంస్కృతి ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. వెరసి జిల్లా మొత్తం జానపద విజ్ఞానంతో నిండి ఉంది. ఆధునిక యంత్రాలు ఎన్ని వచ్చినా నాగలి పట్టి పొలం దున్నడం, ఎడ్ల బండ్లపై సరుకులు మోయడం, ఆకు మూలికలతో వైద్యం చేయించుకోవడం, కుండల్లో వండుకోవడం, వాగు వంకల వల్ల జల వనరులు సమకూర్చుకోవడం మొదలైన జానపద లక్షణాలన్నీ ఇక్కడ కానవస్తాయి. అంటే ఈ జిల్లా జానపద విజ్ఞానానికి మూలకొమ్మ లాంటిది. అందుకే ఇక్కడ జీవించే ప్రజల్ని జానపదులనవచ్చును.

ఇందూరు జిల్లాలో పెండ్లిపాటలకి ఒక ప్రత్యేక స్థానం ఉంది. అందులో సీతారాముల వంటి పురాణ పాత్రల నుండి ఆధునిక వాతావరణానికి సంబంధించిన విషయాలు దాకా ప్రస్తావింపబడతాయి. జిల్లాలో పెండ్లీలు దీపావళి తరువాత ప్రారంభమౌతాయి. సాధారణంగా ఆడపిల్లల ఇండ్లలోనే పెండ్లిళ్లు జరుగుతాయి. పేరుకు ఒకరోజు పెండ్లి అయినప్పటికి మూడు నాలుగు రోజుల కార్యక్రమాలుంటాయి. పల్లెల్లో అయితే రాత్రి ముహూర్తాలు, పట్టణాల్లో పగటి ముహూర్తాలుంటాయి. వారం ముందే వధూవరులకు, ఇంటిల్లి పాదికి, బంధువులకు కొత్త బట్టలు కొనుక్కుంటారు. నగలు చేయిస్తారు. కళ్యాణ మండపం, సన్నాయి వారికి వంట వారికి చెపుతారు. శుభలేఖలు పంపిణీ చేస్తారు. పసుపు దంచి పందిరి గుంజపాతడంతో పెండ్లి పనులు ప్రారంభమౌతాయి. పచ్చటి పందిరి కింద రోకట్లో పసుపు వేసి దంచి, ఇసిరి వచ్చిన పొడిని అక్షింతలతో కలుపుతూ ఐదుగురు ముత్తైదువులు ఈ పాట పాడుతారు.

**పసుపు దంచే పాట :**

**మూడు వోగుల రాయి – ముతియాల రాయి**
**ముగ్గురు ఇసిరేరు నిండు పందిట్ల పచ్చాని పందిట్ల**
**నలుగు వోగుల రాయి నల్లాల రాయి నల్లాల రాయి**
**నలుగురు ఇసిరేరు నిండు పందిట్ల పచ్చాని పందిట్ల**

ఇలా ఐదు పోగుల రాయి, పది పోగుల రాయి అని పాడుకుంటారు. తరువాత పందిరి పోచమ్మ అనిపూజిస్తారు.

పందిరి పోచమ్మకు నైవేద్యం పెట్టిన తర్వాత ఒగ్గోళ్ళను పిలిచి మల్లన్న కథ చెప్పిస్తారు. పందిట్లో సిరి సాపను పరిచి నాలుగు మూలల నాలుగు దీపాలు వెలిగించి ఇసుర్రాయిలో బుక ఇసురుతూ ఈ పాటను పాడుతారు.

**బుక ఇసిరే పాట :**

**ముత్యమంత పేలుకాల పవుడమంత సాద్ది**
**యెల్లిరే వాన్నలు యెలవెగ్గిరాన యెల వెగ్గిరాన**
**పడమట వొయిరే వీలాయిగారు వీలాయిగారు**
**పడుమలు గొట్టిరే పత్తివానాలు పత్తివానాలు**

ఇలా పడమర నుండి మొదలుకొని తూరుపు, దక్షిణ, ఉత్తర దిక్కులనుండి వాసాలు తెచ్చి, వండి పెండ్లి పందిరి వేసి, పోలు పీటల వేసి పెండ్లి పిల్లలను సీతారాముల్లుగా పోల్చుకొని పాడుతారు.

తాళిబొట్టే మంగళ సూత్రం. మంగళసూత్రధారణ పెండ్లి కార్యక్రమంలో అతి ముఖ్యమైన క్రతువు. అందరికీ బంగారం అందుబాటులో కొచ్చిన తర్వాత రకరకాల మంగళ సూత్రాలు చేయించుకుంటున్నారు. మంగళ సూత్రం ఏ రూపంలో ఉన్న అందులో నల్లపూసలు తప్పనిసరి. ఈ నల్లపూసలు దండను కూర్చుతు ముత్తైదువులు పాడే పాట ఈ విధంగా ఉంది.

**సూరుడు ఈచ్చినా సూరుడు ఈచ్చినా**
**సూట్లాయి మెట్యాలు, సునతి కాలుకు వెట్టానైతినోయ్**
**కంటిరో దశరథ కంటిరో నీన్నొగ**
**కండ్లా మొగము జూడా కంటిరోయ్**

ఇలా ముత్తైదువ చిహ్నాలైన మట్టెలు, నల్లపూసలు, గాజులు మొదలైన వాటిని సూర్యుడు, పరమాత్ముడు, గోవిందుడు, నారాయణుడు వంటి దేవతలు ఇచ్చినవిగా భావిస్తారు.

పెండ్లికి ఒకరోజు ముందు జరిగేవి మంగళస్నానాలు. అందులో మైలపోలు ఒక భాగం. మంగళివాని చేత గోళ్ళు కత్తిరింపజేసి నులుగు పిండి నలుగు పెట్టి వధూవరు లిద్దరికి మంగళస్నానాలు చేస్తున్నప్పుడు పాడే పాట ఇది.

**శిట్టెడు ముత్యాల శిల్లిన్నా పోలు**
**ఇదెవ్వరి పోలవ్వ ఇంతా సోద్యములు ॥2॥**
**ఇది తూటుకూరోల్ల శివప్రసాదు పోలు**

చిట్టెడు, అట్టెడు, మానెడు,కుంచెడు కొలతలతోపోలును భావిస్తూ ఆయా పెండ్లింటి వారి కులగోత్రాలతో కలిపి పాడుకుంటారు. ఈ పై పాటలో **తూటుకూరోల్ల శివప్రసాదు** పేరిట పాడగా, ఈ పేరు ఒక్కోఇంట ఒక్కోపేరుగా మార్చుచేసి పాడుతారు.

పందిట్లో పెండ్లి పీటలపై వధూవరులిద్దరిని కూచోబెట్టి బాసింగాలతో సింగారం చేస్తారు. ఇది వర్రకైతే పూల దుకాణాలలో మెరుపు కాగితాలతో తయారు చేసిన బాసింగాలు ముఖం నిండా కప్పి ఉండేవి. ఇప్పుడు బజార్లో రకరకాలైన బ్రాండెడ్ బాసింగాలు దొరుకుతున్నాయి. నకిలీ ముత్యాలతో చేసినవి కొన్నైతే, మెరుగు చమ్కీ దారపు పోగులతో చేసిన బాసింగాలు దొరుకుతున్నాయి. నకిలీ ముత్యాలతో చేసినవి కొన్నైలే, మెరుటు చమ్కీ దారపు పోగులతో చేసిన బాసింగాలు అందుబాటులో ఉన్నాయి. బాసింగం ఏదైన అది పూజనీయమైంది. అందుకే పెళ్ళికి ముందు వాటిని పోచమ్మ దేవత ముందుంచి పూజ చేస్తారు. పాటలు పాడుతారు. అటువంటిదే ఈ పాట.

**తెల్లా చీరలు గట్టి మల్లెలు వొడి వోశెయ్**
**యాడికీ వోతావు సక్కన్ని నా పోశో సక్కన్ని**
**యాడికీ వోతావు సక్కాని నా పోశోయ్**
**తమ్మూడూ పోతాలింగా లగ్గాలు నేనే వోతోయ్ లగ్గాలు**
**తమ్ముడికి రథామడ్గి తాగుడు గులడిగినాదో ! తాగుడుగుల డిగినాదో**
**॥తమ్ముడికి॥**

అని పిల్లల్ని, వారి పశువుల్ని పదిలంగా కాపాడుమని ప్రార్థిస్తారు.

పోషించు అమ్మ పోచమ్మ. పోచమ్మ జానపదుల అభిమాన దేవత. ఆమె గ్రామాన్ని రక్షిస్తుందని జానపదుల నమ్మకం. ఆ తల్లికి బోనం సమర్పించడం ఆనవాయితి. అందుకే ఇక్కడిపెండ్లిలో ప్రతి సందర్భంలో పోచమ్మను తలుచుకుంటారు. బోనాలు పోచమ్మకు ప్రతిరూపాలు. మట్టి కుండకు ముగ్గులు దిద్ది పూలతో అలంకరించి గండదీపం వెలిగిస్తారు. ఒకటి, రెండు, మూడు బోనాలు కూడా అమ్మవారికి సమర్పిస్తారు. పెళ్ళికి ముందు రాత్రి 'ఐనేర్లు' పేరుతో బోనం కుండలు తీసుకురావడానికి కుమ్మరి ఇంటికి ఊరేగింపుగా వెళ్తారు. అలా వెళ్ళేటప్పుడు ముందు వరుసలో ఉన్న మంగళహారతులు పట్టుకున్న ముత్తైదువులు పాడుకునే ఐనేర్ల పాట.

**అల్లానేరెడల్లో అల్లల్లనేరేడి అల్లనేరేడి అల్లోనేరేడల్లో**
**అల్లానేరెడల్లో నల్లగుంట్లా మన్ను నాలుగు శిబ్బాలే అల్లోనేరెడల్లో**
**అల్లానేరెడల్లో ఎర్రగుంట్లా మన్ను యేడు శిబ్బాలే అల్లోనేరెడల్లో**
**అల్లానేరెడల్లో పచ్చాగుంట్లా మన్ను పాది శిబ్బాలే అల్లోనేరెడల్లో**
**అల్లానేరెడల్లో ఆమన్ను ఈ మన్ను కలెరాసి పోసి అల్లోనేరెడల్లో**
**....** " అని ఇలా పాడుకుంటారు.

పెండ్లి తంతుకు ముందు బోనాలు ఎత్తుకొని ఊళ్ళో ఉన్న సప్త మాతృకలను దర్శించుకొని పూజలు చేస్తారు. ముఖ్యంగా జిల్లాలో నల్ల పోచమ్మకు ప్రత్యేకంగా బోనం సమర్పిస్తారు. అమ్మవారికి బలులు ఇచ్చి పోచమ్మ పండుగ జరుపుతారు. పెండ్లిరోజు వధూవరులిద్దరికి చక్కగ నలుగువెట్టి స్నానాలు చేయిస్తారు. పెళ్ళి కూతుర్ని కొత్తబట్టలు, ఆభరణాలతో అలంకరించి మండపానికి తీసుకొస్తున్నపుడు పాడే పాట ఇది.

**యెక్కిపోనా యెండిమేడా – పండి ఉండా బంగారి మేడా**
**మా తల్లి సీతమ్మాకే జాజి మాద విలాయి తోటమ్మా ॥ఎక్కిపోనా॥**

**మూడు యేయిలు వోసి ముత్యాల బన్నాసరము ॥3॥**
**నేడే జేయించినామమ్మా - మా సీతమ్మాకి నాడే జేయించినామమ్మా ॥ఎక్కిపోనా॥**
అంటూ పాడుతారు.

సపరివారంగా వరుడని కళ్యాణ మండపానికి యెదురుకొచ్చిన తరువాత సుముహూర్తంలో భాగంగా మధుపర్కం, మహా సంకల్పం, కన్యాదానం, నాతి చరామి, మాంగళ్యపూజ, మాంగళసూత్ర ధారణ, పల్యాలు పట్టడం, బ్రహ్మముళ్ళు, తలంబ్రాలు, చదివింపులు జరుగుతాయి. ఆ తరువాత నాగెల్లి, భోజనాలకు ముందు వధూవరులిద్దరిని ఇంటి దేవతను మొక్కుకోవడానికి ఇంట్లోకి తీసుకెళ్తారు. ఆ సందర్భంగా వరసైన వారు తలుపుల కడ్డంగా నిలబడి వధూవరులిద్దరు పేర్లు చెప్పుకొమ్మని అప్పుడే తలుపులు తీస్తామని రాగయుక్తంగా పాడే పాట ఇది.

**తలుపులు తీసే పాట :**

**శిట్టెడు శిట్టెడు ముత్యాలిస్త - శిన్నీ పూల దండలిస్త**
**వారెలిస్త సారెలిస్త - వాడి బిడ్డె గంపిస్తే - గంపాయి గజ్జెలిస్తా**
**మెవ్వాయి కుల్లలిస్తం మెగార వంగులిస్తం**
**పాటీకి బర్రె నిస్తం యేటికి యెద్దునిస్తం**
**పిండి దియ్య గోననల్ల గూగూకి గొంగడల్ల**
**కూనుండ పీటెలొల్ల కుడుమా గంగాళమల్ల**
**తెయిగడుగ తెంబొల్ల యేలార జాలువద్దు**
**యెక్కా గుర్రాలు వద్దు నాకోల్ల రాంబాయి తియ్యవె తలుపు**

అని పాడుతారు.

అక్షింతల తరువాత అప్పగింతలు. వధూవరులిద్దరికి ఒడిబియ్యం పోసి ఐదు జంటలు ఆశీర్వదిస్తాయి. ఆ తరువాత నాగెల్లి అంటూ అప్పగింతల కార్యక్రమం ప్రారంభమౌతుంది. పెళ్ళిపందిరికి ఉయ్యల వ్రేలాడదీసి అందులో చెక్క బొమ్మను పడుకోబెడతారు. ఉయ్యాలలూపుతూ పాడె లాలి పాట ఈ విధంగా ఉంటుంది.

**నాగెల్లి (ఉయ్యాల)**

**రామరఘురామ లాలీ - మా పాలి సీతా సమేతలాలీ**
**వరి (హరి) రామ రామ లాలీ - పని (అని) యిట్లు జనులు పాడెదరు లాలీ**
**వరి రామ రామ లాలీ - వని జనులు పాడెదరు లాలి.**
**శ్రీరామ రామలాలి వని యిట్లు శ్రీ (స్త్రీ) లు పాడేరులాలి.**

అని కృష్ణచరిత్రను గానం చేస్తారు.

ఆడపడుచును అత్తింటికి పంపేటప్పుడు పుట్టింటి వారి ఆవేదన అందరికి సమానమే. హృదయాన్ని కదిలించే ఈ సన్నివేశాన్ని మనం అప్పగింతల పాటల్లో వింటూంటాం. ఈ అప్పగింతల పాటలు పాడడానికి ప్రత్యేకంగా గాయకులుంటారు. అప్పగింతల తరువాత వధువు తన పుట్టింటివారందరి దగ్గర వీడ్కోలు తీసుకొని, అత్తింటికి ప్రయాణమయ్యే సమయంలో కూతురుకు హితవు చెపుతూ...

**అంగట్లో పసుపోలె ఆడబిడ్డవు తల్లి ॥2॥**
**పోయి రావమ్మ గోవిందమ్మ పేరు తేవమ్మా ॥2॥**
**వంటశాలల నీవు కురులిప్ప వోకమ్మ ॥2॥**
**పోయి రావమ్మ గోవిందమ్మ పేరు తేవమ్మా ॥2॥**
**బిడ్డ పోయి వచ్చెదనే మముగన్నదల్లి పేరు తెచ్చెదనే ॥2॥**

అత్తవారింట్లో అమ్మాయి ఉండవలసిన విధానాల్ని ఉపదేశిస్తారు.

ఇవన్ని నాగరికత రుచిమరిగిన జనుల పెళ్ళి వరుసలు. ఐతే తరతరాలుగా సంచార జాతులుగా జీవనం సాగిస్తున్న వారికి ఇలాంటి కట్టుబాట్లు అక్కరలేదు. అలా అని వారిలో అందరు పెండ్లిని సరళంగా ఆచరిస్తారని లేదు. వారిలో చాలా మంది వివాహాలలో ఇంకా ఎక్కువగా ఆచారాలు. పాటలు వినిపిస్తాయి. సాహిత్య రచన మనిషి ఆచార వ్యవహారాలను, నమ్మకాలను జీవన విధానాల్ని ప్రతిబింబిస్తుంది. సాహిత్యంలో అనేక పేర్లు, ప్రాంతాలు, గాథలు, వీరగాథలు సూచింపబడతాయి. పెండ్లి పాటలు జానపద సాహిత్యంలో ఒక మౌఖిక ప్రక్రియ. ఇంతకు ముందే చెప్పుకున్నట్లు ఈ సాహిత్యంలో అనేక అంశాలు పొందుపరచి ఉంటాయి. శ్రీనాథుడులాంటి మహాకవి తన గ్రంథాల్లో ఆనాటి జానపదుల కళలను, వాటిలోని పాటలను ప్రస్తావించడం వల్ల అరుదైన ఎంతో విలువైన సమాచారం మనకు లభించింది. పెండ్లిపాటలు కూడా ఆయా కాలాల జానపదుల ఆచార వ్యవహారాలను సంప్రదాయాలను, సాహిత్యపు విలువలను ప్రస్ఫుటం చేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

**శ్రీమతి స్వప్నారాణి తిప్పోల్ల, ఎమ్.ఏ., (పిహెచ్.డి)**
**అసిస్టెంట్ లెక్చరర్ ఇన్ కర్ణాటిక్ ఓకల్**
**శ్రీ జ్ఞాన సరస్వతీ స్కూల్ ఆఫ్ మ్యూజిక్ అండ్ డాన్స్,**
**నిజామాబాద్.**

# నేమాని అంతరంగం



శ్రీ జె.ఎస్.శాస్త్రి

**ప్రముఖ సీనియర్ మృదంగ విద్వాంసులు శ్రీ నేమాని సోమయాజులు గారి సంగీత ప్రయాణం 50వ మైలు రాయి దాటిన సందర్భంగా గానకళ సహాయ సంపాదకులు – సంగీత ప్రియులు – విశ్లేషకులు శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి వారితో అనుభవాల సారాన్ని పంచుకొన్నారు. సంగీతప్రియులు కోసం 'గానకళ' వాటిని అందిస్తున్నది.**

ప్రశ్న 16: గురుపరంపరగా లభించిన జ్ఞానాన్ని అపారమైన మీ అనుభవాన్ని మేళవించి గ్రంథరచన చేపట్టారు కదా! మీలోని ఆ పార్శ్వం గురించి మా పాఠకులకు తెలియజేయండి.

**జ)** చిన్నప్పుడు స్టాంపుల సేకరణ హాబీగా ఉండేది. క్రొత్తదేది దొరికినా జాగ్రత్త పెట్టుకోవడం. అలాగే మృదంగం నేర్చుకోవడం మొదలుపెట్టాక ముక్తాయిలు సేకరించడం ఒక అలవాటుగా పెట్టుకున్నాను. మనం కచేరిలో వాయించినా, ఎవరైనా వాయించినది విన్నా రోజుకొక ముక్తాయి మన ఖాతాలోకి చేరాలి. అలా సేకరించి ఒక పుస్తకంలో పెట్టుకునే వాడిని. మా గురువుగారి దగ్గర పుస్తకంలో చాలా ముక్తాయిలు ఉండేవి. అవన్నీ వ్రాసుకున్నాను. వ్రాసుకుని అక్కడినుంచి ఈ 40-45 సంవత్సరాలలో ఎంతమంది వాయించినవి ఎన్ని విన్నామో వాటిని తరువాత ఆ చిన్న ముక్తాయిలను ఆధారంగా చేసుకొని నా సొంత బాణీలో తయారు చేసుకోవడం నేర్చుకున్నాను. అలా చేసినవి అన్నీ కలిపి చాలా అయిపోయాయి. చాలామంది అన్నారు. మరో పుస్తకం వ్రాయచ్చుకదా అని. అంటే అరవై ఏళ్లు దాటనియ్యండన్నాను. సీనియర్ సిటిజన్ అవుతాం కదా!

రిటైరైన మర్నాటినుంచి వ్రాయడం ఆరంభించాను. గురువుగారి దగ్గర అంత విద్య సంపాదించాను. గురుకుల వాసంలో అంటే గురువుగారింట్లో సేవ చేస్తూ నేర్చుకున్నాను. గురువుగారికి ఏమిచ్చాం ? ఏమివ్వలేదు.

అప్పుడేం చెయ్యాలి? గురువుగారు వ్రాసినవి యథాతథంగా ఒక పుస్తకంగా వేసి జనబాహుళ్యంలో ప్రచారంలోకి తేవాలి. ఆరకంగా అదే గురువుగారికి గురుదక్షిణగా సమర్పించుకోవాలి అనే నిర్ణయానికి వచ్చాను. ఆయన దగ్గర నేర్చుకున్న పాఠాలన్నీ మొదట్నించి చివరివరకు వ్రాసి పార్ట్ -1 గా దానిని ఉంచాను. పుస్తకం అనే సరికి ఎన్నో హంగులు అవీ ఉండాలి. లేకపోతే చెల్లుబాటు కాదు. ఆ ఉద్దేశ్యంతో సర్టిఫికెట్ కోర్సు, డిప్లమో విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని కొంత థియరీ కూడా వేశాం. ఇంతకు ముందు ఆంధ్రదేశంలో 1964-66 ప్రాంతాల్లో ధర్మాల రామ్మూర్తిగారు "మృదంగతత్వం' అని ఒక పుస్తకం వ్రాశారు. 1970లలో మహాదేవు రాధాకృష్ణంరాజుగారు ఒక పుస్తకం వ్రాశారు. రెండిటికీ మధ్యేమార్గంగా విద్యార్థులకు పనికొచ్చేలా ఈ పుస్తకం తయారైందని చెప్పగలను. పార్ట్ - 2గా థీరి అంతా వేశాం. మరిప్పటివరకు గురువుగారిదే ఆయన చెప్పింది చెప్పినట్లు ఉంచాం. మరి నా ప్రతిభ ఏముందిందులో? నా వంతుగా నేను చిన్నప్పటి నుంచి సేకరించిన ముక్తాయిలన్నీ ఇందులో చేర్చాను. అవి 500 ముక్తాయిలు వేసి మొత్తం మూడు అంశాలూ కలిపి పుస్తకం తయారైంది. కవర్ పేజీలో డిజైన్ వీణ డి.శ్రీనివాస్ గారే చేశారు. ఇంక ఏం పేరు పెట్టాలి? అప్పటికి చాలా కాలం క్రిందట శ్రీపాద పినాకపాణిగారు రచించిన 'సంగీత సౌరభం' అనే గ్రంథం 4 సంపుటాలుగా వెలువడి సంగీతలోకంలో మంచి ఆదరణను పొందింది. ఈ సౌరభం అన్నమాట జనాల్లోకి చొచ్చుకుని -వెళ్లింది కాబట్టి

దీనికి 'మృదంగ సౌరభం' అని పేరు పెట్టడం జరిగింది. 2013లో ఉగాదినాడు విజ్ఞానసమితి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో పుస్తక ఆవిష్కరణ జరిగింది. నా తొలి గ్రంథాన్ని ఆవిష్కరించిన విజ్ఞానసమితి వారికి ధన్యవాదాలు. సర్టిఫికెట్, డిప్లమో కోర్సులకు ఈ పుస్తకాన్ని రిఫరెన్స్ గ్రంథంగా పెట్టడం జరిగింది. పుస్తకానికి మంచి ప్రతిస్పందన వచ్చింది. ఆంధ్రప్రదేశ్ లోను, చెన్నైలోనూ పరిచయం చేశాము. ఆ సంవత్సరం చివరిలోనే ఈ పుస్తకం తెలుగులో ఉండడం వల్ల బయటరాష్ట్రాలవారికి, తెలుగు చదవడం రాని తెలుగు విద్యార్థులకు అందుబాటులో లేకపోతున్నదని ఆలోచించి ఇంగ్లీషులో తర్జుమా చేయించి ప్రచురించాము. ఆ పుస్తకావిష్కరణ చెన్నైలో జరిగింది. ఆ సభకు మధురై టి. ఎన్. శేషగోపాలన్, మృదంగ విద్వాన్ టి.కె.మూర్తి, క్లేవ్‌లేండ్ సుందరంగారు ఇతర ప్రముఖులు వచ్చారు. శేషగోపాలన్ నా కృషిని మెచ్చుకుంటూ బాగా మాట్లాడారు. క్లేవ్ లెండ్ సుందరంగారు పుస్తకంలోని విషయం చాలా విలువైనది, బాగుంది, మీరు అమెరికా రండి అక్కడ కూడా ఆవిష్కరణ చేద్దాం అని ఆహ్వానించారు. ఆ ప్రకారం నేను 2014లో అమెరికా వెళ్లడం పుస్తకావిష్కరణ జరిగి మంచి గుర్తింపు రావడం జరిగింది. అమెరికాలో నేను ఈతీరం నుంచి ఆతీరం వరకు పర్యటించాను.

అంతటా ఈ పుస్తకం కాపీలు తీసుకున్నారు. కారణమేమిటంటే ఇందులో మృదంగం వాళ్లకేకాక గాత్రం పాడేవారికి, జంత్రవాద్యాలవారికి, నాట్యం అభ్యసించేవాళ్లకీ పనికొచ్చే ముక్తాయిలు, స్వరకల్పనకి ఉపయోగపడే సంగతులు చాలా ఉన్నాయి. అందువల్ల అందరూ తీసుకున్నారు. ఆరకంగా పుస్తకం మంచి ప్రాచుర్యంలోకి వచ్చింది. మరో పుస్తకం వ్రాయాలనే సంకల్పం కలిగి అదికూడా కార్యరూపం దాల్చింది. ఆ రచన పేరు 'మోహరాలు- ముక్తాయిలు'. 35 తాళాలకి తిశ్రగతిలో, చతురశ్రగతిలో మోహరా ముక్తాయిలు... అంటే మొత్తం 70 వస్తాయి. అవికాక కొన్ని ముగింపులు, కొన్ని పాఠాలు వ్రాసి రెండో పుస్తకం కూడా అదే టైటిల్‌తో చూడగానే నేమాని పుస్తకమా అనిపించేటట్లుగా ముద్రణ చేయించాము. ఇదికూడా తెలుగు, ఇంగ్లీషు భాషలలో వేశాము. ఈ పుస్తకం కూడా క్లీవ్‌లెండ్ లోనే ఆవిష్కరణ జరిగింది. నేను 2014 నుండి 2018 వరకు వరుసగా క్లీవ్‌లెండ్ వెళ్లాను. ప్రతి సంవత్సరం ఏప్రిల్ లో వెళ్లడం, జూలైలో తిరిగి రావడం. ఆ అయిదు సంవత్సరాలు నా అమెరికా పర్యటనలు విజయవంతం కావడానికి దోహదం చేసిన వింజమూరి కుటుంబానికీ, క్లీవ్ లెండ్ సుందరంగారికి, సిలికానాంధ్ర కూచిభట్ల ఆనంద్ గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. ఇవి ఇలా నడుస్తుండగా ఇంకా ఏదో చెయ్యాలనిపించి మూడో పుస్తకం పల్లవులు వ్రాద్దామనిపించి మొదలుపెట్టాను. మొదటి పుస్తకం రెండో పుస్తకం తయారవుతున్నప్పుడే పల్లవులు వ్రాయడం ఆరంభించాను. శబ్దపల్లవులు. ఆపుస్తకం పూర్తవడానికి మూడేళ్లు పట్టింది. అందులో 1350 తాళాలకి శబ్దపల్లవులు వ్రాశాను. 750 పేజీల ఉద్గ్రంథం అయిపోయింది. అలాంటి పుస్తకం ఇప్పటివరకు సంగీత లోకంలో లేదు. అన్ని తాళాలకి శబ్దపల్లవులే కాకుండా ఆ పల్లవికి మళ్లా మోహరా ముక్తాయి ఎక్కడినుంచి వస్తుంది, ఆ పల్లవి ఇస్తే ఆర్టిష్టు మోహరా ముక్తాయి ఎలా వాయిస్తాడు, ఇవన్నీ దాన్లో వివరంగా ఇవ్వడం జరిగింది. ద్వినడ పల్లవులు, త్రినడ పల్లవులు వంటివి చేర్చబడ్డాయి.

ఆ పుస్తకం చాలా లోతైన విషయంతో తయారైంది. అది కూడా సుందరంగారు చూసి చాలా బావుంది, మీవంటివారు చెన్నైలో ఉంటే ఇంకా గుర్తింపు వచ్చేదని ప్రశంసించారు. ఆ పుస్తకం మొదటి ప్రతి ప్రముఖ మృదంగ విద్వాంసులు తిరుచ్చి శంకరన్ గారికి ఇచ్చారు. ఆయన చాలా సంతోషించారు. మూడవ పుస్తకం కూడా బాగా ప్రాచుర్యం పొందింది. మొత్తంమీద భగవంతుని కృపవల్ల గురువుగారి ఆశీర్వచనబలంతో మృదంగం మీద మూడు పుస్తకాలు రచించిన ఘనత కర్ణాటక సంగీత రంగంలో నాకే లభించింది. నేను భోగట్టా చేశాను, వ్రాయగలిగిన సామర్థ్యం ఉన్న వాళ్లు కూడా వ్రాయలేదు. మనవాళ్లు కూడా ఎవరూ చేపట్టలేదు. అవకాశం నాకు దక్కింది. తరువాతి తరానికి నా వంతు బాధ్యత నేను నిర్వర్తించాను.

మామూలుగా వాయిస్తున్నంతసేపే జనం గుర్తు పెట్టుకుంటారు. సీడీలు కూడా కొంతకాలమే నిలుస్తాయి. అదే పుస్తకం అయితే చిరకాలం ఉంటుంది. ఎప్పుడో రచించబడ్డ రామాయణ భారతాలు ఇప్పటికీ దొరుకుతున్నాయి. 14వ శతాబ్దంలో వ్రాసిన 'సంగీత రత్నాకరం' వంటి గ్రంథాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

అందుకే పుస్తకాలుగానే వ్రాయాలని ప్రేరణ కలిగింది. మొదటి పుస్తకం వ్రాస్తున్నపుడు ఒక సంఘటన జరిగింది. రూపకతాళం పాఠం వ్రాస్తుంటే ఒక పాఠం కొంచెం మార్చబోయాను, మార్చాను. మార్చేసి పుస్తకం మూసేసి పడుకున్నాను. రాత్రిళ్లు 10గంటల నుంచి ఒంటిగంట వరకూ వ్రాసేవాడిని. రాత్రి కలలో గురువుగారు కనబడి ఏమోయ్ నా పాఠాలు వ్రాస్తానన్నావు కదా, ఈ పాఠం ఎందుకు మార్చావు, అది విన్నవాడూ చూసిన వాడూ మార్చుకుంటే మార్చి వాయించు కుంటారు, నువ్వెందుకు మారుస్తావు, అలాగే ఉంచు అని చెప్పినట్లుగా అనిపించింది. వెంటనే తెలివొచ్చి లేచి ఆ వ్రాసిన కాగితం చించేసి గురువు గారు చెప్పనట్లే మళ్లీ వ్రాసి పడుకున్నాను. అంటే నేను పుస్తకం వ్రాస్తున్నానంటే గురువు గారు పైనుంచి చూస్తున్నారన్నమాట. నేను వ్రాస్తున్నానంటే గురువుగారు సంతోషించారని నాకనిపించింది. ఈ మూడు పుస్తకాలకు గురువుగారి ఆశీస్సులు చాలా ఉంటాయి. గ్రంథరచన ఒక ప్రత్యేక బాధ్యతగా ఎంచుకున్నది కాగా సహజమైన బాధ్యత అందరు విద్వాంసుల వలెనే శిష్యులకు ప్రత్యక్షంగా విద్యాబోధన. అనూచానంగా వచ్చే ఈ సంప్రదాయాన్ని పాటించాను.

ఏభైమందికి పైగా శిష్యులు నా దగ్గర శిక్షణ పొంది విద్వాంసులుగా సంగీతరంగంలో ఉన్నారు. నేను రచించిన పుస్తకాల ద్వారా నా బోధనా పద్ధతుల వలన ప్రయోజనం పొందిన పరోక్ష శిష్యులు అసంఖ్యాకంగా ఉంటారు. నా దగ్గర వీణ ఆర్టిస్ట్ లు చాలామంది లయలో మెళకువలు నేర్చుకున్నారు. వాళ్లతో కలిసి కూర్చుని ఒక గంటసేపు మృదంగం తో వాయిస్తూ గైడెన్స్ ఇస్తూ ఉంటాను. నా దగ్గర చెప్పుకున్న వారిలో ఆకాశవాణి గ్రేడింగులు కూడా కొందరికి వచ్చాయి. ఇంచుమించు 10, 15 సంవత్సరాలైనా ఇప్పటికీ కంటిన్యూ చేస్తున్న వారు ఉపారెడ్డిగారని బీ హై ఆర్టిస్ట్ ఒకావిడ, పద్మా రామకృష్ణ ఏ గ్రేడ్ ఆర్టిస్ట్ ఒకామె, రాగం తానం పల్లవులు, అందులో ముక్తాయిలూ ఇలాంటి లయలో మెళకువలు చెప్పకుంటూ ఉంటారు. వారిద్దరూ బండి శ్యామల గారి శిష్యురాండ్రు.

ప్రశ్న 17: సుదీర్ఘ సంగీత ప్రస్థానంలో ఎన్నో సత్కారాలు, బిరుదులు పొంది ఉంటారు. వాటిలో కొన్ని పేర్కొంటారా ?

**జ)** 1987లో నేను ఆకాశవాణి హైదరాబాద్ లో ఉద్యోగం రావడం వల్ల విశాఖపట్నం నుండి వచ్చేస్తున్న సందర్భంలో దూర్వాసుల భాస్కరమూర్తి గారని, విజయత్యాగరాజ సంగీత సభ పూర్వ సెక్రటరీ నాకు సన్మానం చేసి గోల్డ్ మెడల్ తో సత్కరించారు. ఆయన 1976-80 ప్రాంతాల్లో కచేరీలు ఏర్పాటు చేసి నన్ను బాగా ప్రోత్సాహించారు. 1997 లో 'ఉభయవాద్య ప్రవీణ' బిరుదు - సావిత్రి చారిటబుల్ ట్రస్ట్, హైదరాబాద్ వారు ప్రదానం చేశారు. 2000 సంవత్సరంలో షడ్గట లయవిన్యాసం చేసిన సందర్భంగా శ్రుతి లయ ఆర్ట్స్, హైదరాబాద్ వారు సన్మానించి 'ఘటవాద్య చక్రవర్తి ' బిరుదుతో సత్కరించారు. 2005 లో 'జలతరంగ కళాప్రవీణ' బిరుదు శ్రీరామ గానసభ, రాజమండ్రి వారిచే నిమ్మలపూడి వీర్రాజుగారి ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. 2007 సంవత్సరంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి సమక్షంలో ఘటం వాయించాను. వారికి ఆసమయంలో పాద నమస్కారం చేయగా బాబా ఆశీర్వదించి ఒక బంగారు గొలుసు సృష్టించి నాకు బహూకరించారు. నా జీవితంలో అదొక మధురానుభూతి. 2010 లో కంచి కామకోటి పీఠంవారి ఆస్థాన విద్వాంసునిగా నియమించబడి సత్కారాన్ని పొందాను. 2012లో శ్రీమతి యర్రమిల్లి రమాప్రభ గారి ఆధ్వర్యంలో ఆంధ్రమహిళాసభ, హైదరాబాద్ వారి సంగీత కళాశాల వారిచే 'అనవద్య వాద్య

విశారద' బిరుదు పొందడం జరిగింది. 2017 సంవత్సరానికి తెలుగు విశ్వవిద్యాలయం వారి ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేయబడి 2018 లో ఆ పురస్కారాన్ని స్వీకరించడం జరిగింది. 2017 లో విజయ త్యాగరాజ సంగీత సభ, విశాఖపట్నం వారిచే 'సంగీత సుధానిధి' బిరుదాన్ని, 2018 లో సంగీత కళాసాగరం, హైదరాబాద్ వారి 51వ వార్షిక సంగీతోత్సవంలో 'సంగీత కళాసాగర బిరుదాన్ని, ఇవ్వడం జరిగింది. ఘటవాద్యానికి టాప్ గ్రేడ్ వచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఘటం టాప్ గ్రేడ్ నేనొక్కడినే. విదేశీ పర్యటనలు లెక్కించలేనన్ని చేశాను, ఆయా సందర్భాలలో చాలవరకు వాటి వివరాలు చెప్పాను.

ప్రశ్న 18 : సంగీతరంగంలో రాణించాలనుకునే యువతకు మీరిచ్చే సందేశం.

**జ)** మన జీవన విధానంలో సాంకేతికత ప్రభావంతో ఎన్నో మార్పులు వచ్చాయి. విద్యాబోధనలో కూడా మార్పులు వచ్చాయి. కానీ సంగీత విద్యాబోధనలో, ఆ మాటకువస్తే సంగీతరంగంపై మాత్రం ఆ ప్రభావం అంతగాలేదు. సాంకేతిక ఉపకరణాలను అవసరం మేరకు వాడుతున్నాం తప్ప మౌలికమైన మార్పులేమీ జరగలేదు. అవసరం లేదు కూడా. సంగీతం మౌఖికవిద్య. గురువు స్థానానికి ప్రత్యామ్నాయాలేమీ ఉండవు. అందువల్ల సంగీత రంగంలో పైకి రావాలనుకునే యువత గురువు పట్ల శ్రద్ధ, క్రమశిక్షణ, వినయం ఇటువంటి సద్గుణాలను అలవరచుకోవాలి. 'విద్యాదదాతి వినయం' అని చెప్పారు కదా పెద్దలు. అలాగే ఈ అలవాట్లు మీ విద్యా సముపార్జన అయిపోయాక కూడా కొనసాగాలి. మీరెంత విద్వాంసులైనా మీ గురువులు, గురుతుల్యులైన సీనియర్ విద్వాంసుల యడల గౌరవ మర్యాదలతో మసలుకోవాలి. మాగురువుగారు శ్రీ కాట్రావులపల్లి వీరభద్రరావు గారితో అనుబంధం విద్యార్థిగానే కాక వారితో సహ విద్వాంసునిగా వారు జీవించి ఉన్నంతకాలం కొనసాగింది. అది చాలా అరుదైన అదృష్టం. గురువుగారితో కచేరీలలో పాల్గొనేటప్పుడు ఏ రోజు ఆయనకంటే ఒక అడుగు ముందు నడవలేదు. ప్రక్కన కూర్చోవలసినపుడు ఆయన కూర్చున్న స్థానానికి ఒకింత తక్కువ ఎత్తులో ఉన్న చోట కూర్చొనేవాడిని. కచేరిలో వేదిక పైకి ఆయన మృదంగం నేనే తీసుకొని వెళ్లి దానిని సిద్ధం చేసి అప్పుడు వెళ్లి నా స్థానంలో కూర్చునేవాడిని. అలాగే కచేరి ముందు కళాకారుల పరిచయంలో కూడా నా విద్యార్హతలను చెప్పవద్దని నిర్వాహకులను కోరేవాడిని. ఎందుకంటే నేను బి.ఎ. పాసయ్యాను. గురువు గార్కి చిట్టిబాబు గారికి మామూలు డిగ్రీలు లేవు.

గురుకులవాసాలన్నీ నాతో ఆఖరు. నా తర్వాత గురుకుల వాసాలు లేవు. నెలకో, క్లాసుకో ఇంత డబ్బని ఇవ్వడం పాఠం చెప్పించుకోవడం. డబ్బులిచ్చి పాఠం చెప్పించుకుంటున్నారంటే గురువు పట్ల వాళ్లకంత భక్తి, వినయ విధేయతలు ఉండవు. డబ్బులిస్తున్నాం చెప్తున్నారు అనే భావంలోనే ఉంటారు. అప్పుడంటే మేమేమీ ఇవ్వలేదు, ఇంట్లో సేవ చేసుకుంటూ నేర్చుకున్నాం కాబట్టి గురువుగారంటే భయభక్తులతో ఉన్నాం. ఇప్పుడలా చెప్పలేము. ఎవరూ ఉండటంలేదు కూడా. కాలం మారింది. ఈ కాలంలో శిష్యులు వేరు. హలో అంటే హలో అనుకోవడమే తప్ప అంతలా ఉండమని చెప్పలేం. ఉన్న వాళ్లు ఉన్నారు, లేనివాళ్ళు లేరు. అంతకర్లేదు. కనీసం 15 రోజులకొకమాటు ఫోన్ చేసి గురువుగారూ, ఎలా ఉన్నారు ? అని అడిగితే చాలు. అదికూడా చెయ్యరు. మనం ఫోన్ చేస్తే గురువుగారూ బావున్నారా! అనడమే కానీ వాళ్లంతట వాళ్లు ఫోన్ చేసి అడగరు. అదీ ఈ కాలం శిష్యుల తీరు. మరొక అపచారం, నాదృష్టిలో ఈ తరం విద్వాంసులు తమ గురువుల పట్ల చేస్తున్నది, ఏ గురువు దగ్గర నేర్చుకున్నామని చెప్పుకుంటున్నారో వారి బాణీ మార్చేసి, అవకాశాల కోసం వేరేవారి, ముఖ్యంగా తమిళుల బాణీలను అనుకరించడం. చాలామంది ఆంధ్రవిద్వాంసుల కంటే తమిళ వాతావరణంలో ఎక్కువ వాయించినవాడిని నేను. ఇప్పుడిక్కడ కూర్చుని వారి వాద్యం అనుకరించే వారిపై కంటే

నాపై ఆ ప్రలోభం ఎక్కువ ఉండి ఉంటుంది కదా! కానీ నేనేనాడూ ఆ పని చేయలేదు. అవకాశాలు ఎన్ని వస్తే అన్నే వస్తాయి. నా వాద్యం వింటే వీరభద్రరావుగారి శిష్యుడై ఉంటాడనిపించాలి. ఒకరి శిష్యుడినని చెప్పుకుంటూ వేరొకరి పంథాలో వాయిస్తే గురువులు బాధపడ్తారు, ఏలోకాన ఉన్నా అని నమ్ముతాను. అలాగే చివరగా ఒక మాట.......

సంగీతవిద్యా సముపార్జనలో కఠోర పరిశ్రమ అవసరం. దానికి షార్ట్ కట్ లు లేవు, ప్రత్యామ్నాయమూ లేదు.

ప్రశ్న 19: చివరిగా, అర్ధశతాబ్ది కాలం విస్తరించిన మీ సార్థక సంగీత జీవితాన్ని సింహావలోకనం చేసుకుంటుంటే కలిగే భావాల్ని 'గానకళ' పాఠకులతో పంచుకోమని మనవి!

**జ)** ఎన్నో కష్టాలకోర్చి సంగీతాభ్యాసం చేశాను. గురువుగారి కటాక్షం వల్ల అత్యున్నత స్థాయిలో విద్య లభించింది. మృదంగ, ఘట వాద్యాలు రెండూ సమానంగా నేర్చుకున్నా, నేను కచేరీలకు వాయిస్తున్న ప్రారంభదినాల్లో ఘటవాద్య విద్వాంసులు ఆంధ్రప్రాంతంలో దాదాపుగా ఎవరూలేని పరిస్థితి ఉండడంతో నన్ను ఘటం వాయించడానికి ఎక్కువ పిలిచేవారు. అలా అని మృదంగానికి వచ్చే అవకాశాలూ నేను వదులుకోలేదు. సంగీతరంగమే కాదు ఒకటికంటే ఎక్కువ రంగాలలో ప్రావీణ్యం ఉన్న ఏ వ్యక్తికైనా ఒక రంగంలోనే ఎక్కువ గుర్తింపు రావడం సర్వసాధారణం. నా విషయంలోనూ అదే జరిగింది. అది భగవదేచ్ఛగా స్వీకరించి తదనుగుణంగా నా విద్యను మలుచున్నాను. 'ఫిడేల్ నాయుడు, 'వీణ' చిట్టిబాబు గార్లలా నేనూ 'ఘటం' సోమయాజులుగా పిలవబడుతున్నాను. నేను జలతరంగం వాయిస్తుంటే మద్రాస్ లో ఘటం సోమయాజులు గారేనా అని అడిగేవారు. ఆ సంశయం లేకుండా ఉండడానికి ఘటం సోమయాజులు ప్లేయింగ్ జలతరంగం అని పరిచయ వాక్యాల్లో చెప్పేవారు. అంటే నా పేరులో ఘటం ఒక భాగమైపోయింది. నా కెరీర్లో ఘటవాద్యంలో పోటీ లేకుండా ఇన్ని సంవత్సరాలు ఉండడం కూడా నాకు అనుకూలించిన మరో అంశం. అందుకు భగవంతునికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఘటవాద్యం వల్ల నాపరిధి విస్తృతమైంది. ముఖ్యంగా తమిళ విద్వాంసులతో కలిసి వాయించడంవల్ల విభిన్న గురుసాంప్రదాయాలకు దీటుగా వాయించేలా నన్ను నేను సిద్ధం చేసుకోవలసి వచ్చింది. మాగురువుగారు ప్రసాదించిన మర్మమెరుగని బోధన, ఆశీర్వచనబలం నాకు అనుక్షణం అండగా నిలిచాయి. నేను తెలుగువానిగా ప్రారంభించి ఎక్కడెక్కడ పేరు తెచ్చుకున్నా తెలుగు నేలమీదే స్థిరపడ్డాను. నా బాణీ ప్రత్యేకంగానే అభివృద్ధి చేసుకుని అది 'ఆంధ్రా' బాణీగా మద్రాస్ లో వ్యవహరించేవాడిని. మీరు మనసులో భావాలు చెప్పమన్నారు కదా! ఇప్పుడు మాతరం మృదంగ విద్వాంసులు ఒకరిద్దరు తప్ప లేరు. నా బుర్రకి పూర్తి స్థాయిలో పనిచెప్పే మృదంగ విద్వాంసులు ఎదురౌడం లేదు. నేను ప్రక్కవాద్యానికి ఉన్నానంటే ఇప్పటి మార్దంగికులు హెచ్చరికగానే ఉంటారు. ఆత్మవిశ్వాసంతో చెప్తున్న మాటిది. నాకు మృదంగ, ఘట వాద్యాలు రెండూ రెండు కళ్లలాంటివి. మృదంగ విద్య మంచి ఉద్యోగం, ఉద్యోగానంతర భద్రత కల్పిస్తే, ఘటం జలతరంగం వాద్యాలు దేశ విదేశాలలో ఖ్యాతిని సంపాదించి పెట్టాయి. ఘటవాద్యం నాకిచ్చిన స్థాయిని ఆదర్శంగా తీసుకొని ఇప్పుడు కొందరు యువకళాకారులు ఘటాన్ని ప్రధాన వాద్యంగా ఎంచుకుంటున్నారు. ఇది నాకు గర్వంగా ఉంటుంది. నేను ఇన్ని వేల కచేరీలు చేశానంటే ఎన్నో సంగీత సభలవారి ప్రోత్సాహమే అందుకు కారణం. ప్రతి సంవత్సరం గుర్తుపెట్టుకుని అభిమానంగా పిలిచి ప్రోగ్రాములిచ్చిన సభలు ఎన్నో ఉన్నాయి. నేను కూడా అన్ని సభల వారితో స్నేహపూర్వకంగా మెలిగి నావైపునుంచి ఏ అసౌకర్యమూ కలగకుండా సహకరించాను. ఈ 50 సంవత్సరాలలో ఆయా సభల నిర్వాహకత్వం వహించిన పెద్దలందరికీ నా కృతజ్ఞతలు. అలాగే చక్కని ప్రశ్నలతో మాపాఠకులు, అర్థశతాబ్దిగా నన్నభిమానించి ఆదరిస్తున్న సంగీత అభిమానుల ముందు నా అంతరంగ ఆవిష్కరణకు అవకాశం ఇచ్చిన 'గానకళ' కు ప్రత్యేక ధన్యవాదాలు.

# A Tribute to Smt. Lakkaraju Seshakumari



Smt. Lakkaraju Seshakumari's sudden departure to heavenly abode has created a big vacuum in the Kakinada community.

She was a person of high integrity, embodiment of knowledge, person with empathy, great social worker and a philanthropist. She is bestowed with so many special qualities and is not easy to describe her without missing some of them. Her sudden departure is a big loss for the Kakinada community because she was actively involved in several programs, organizations, and contributed for the development and sustenance of those activities.

Sankurathri Foundation is blessed by her association since last 30 years and decided to pay homage to this extraordinary lady by starting an endowment lecture in her memory as **"Smt. Lakkaraju Seshakumari Women Empowerment Lecture",** which will be conducted every year on her birthday to honor an outstanding woman leader.

# సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'

## అమెరికాలో వైభవోపేతంగా జరిగిన వాగ్గేయకారోత్సవం - 2022

జూన్ 11వ తేది, స్థిరవారం, శ్రీ అష్టలక్ష్మి దేవాలయం, హ్యూస్టన్ లో, తెలుగు సాంస్కృతిక సమితి (హ్యూస్టన్), స్వరభారతి మరియూ భారతీయవాహిని సంస్థలు సంయుక్తం గా నిర్వహించిన వాగ్గేయకారోత్సవం ఆద్యంతం అద్భుతంగా జరిగింది. సుమారు 50-60 కళాకారులు పాల్గొని ఆహూతులను ఎంతగానో అలరించిన ఈ కార్యక్రమం హ్యూస్టన్ సంగీత ప్రియులకు ఈ మండు వేసవిలో ఒక ఉపశమనం. ఉదయం 10 గంటలకు శ్రీమతి శ్రీదేవి జోస్యుల జ్యోతి ప్రజ్వలనతో, దేవాలయార్చకులు శ్రీ ప్రసాద్ గారి అర్చనతో మొదలైన ఈ కార్యక్రమంలో టి.సి.ఎ అధ్యక్షులు శ్రీ కిరణ్ నెక్కంటి గారు స్వాగతవచనాలు పలికారు. అనంతరం, వాగ్గేయకార వైభవం అనే శీర్షికన శ్రీమతి జోస్యుల శ్రీదేవి నిర్వహణలో జరిగిన గోష్టి గానం శ్రోతలలో భక్తి పార వశ్యాన్ని కలిగించింది. ఈ బృందం వారు, ప్రసిద్ధ వాగ్గేయకారుల (అయిదు మంది) రచనలను ఎంచుకొని ఆలపించడం జరిగింది. ఆ సంకీర్తనలు వరుసగా, ఓ రామ నీ నామ - భద్రాచల రామ దాసు; శివ శివ భవ శరణం - నారాయణ తీర్థులు; పాహి నారేయణ - కైవార యోగి నారేయణ; రామ రామ యనరాదా -ప్రయాగ రంగదాసు; యేతీరుగనను - భద్రాచల రామదాసు మరియూ శరణు శరణు - అన్నమాచార్య. ఈ బృందం లో శ్రీమతులు హిమ బిందు పొన్నపల్లి, ఉష అయ్యగారి, రోహిణి ధూళిపాళ, స్వర్ణ లంక, అపర్ణ గంటి, ఉమాసుందర్, లక్ష్మి ముక్కవిల్లి, గాయత్రి అవధానుల, హేమనళిని అక్కిరాజు, శిరీష పిల్లలమర్రి, ఇందిరావిజయ్, కృష్ణప్రియ కూరెళ్ళ, జ్యోతి వెంకటేశన్, అను గన్నవరపు, శ్రీవిద్య, శ్రీ గౌరీ అంబటిపూడి, దీప్తి, శ్వేత, ప్రేమ చీటి, స్మిత ప్రహ్లాద్, పద్మ సీతపల్లి, కుమారీలు - మేఘన కర్రా, అలేఖ్య సాంబరాజ్, ఆశ్రిత, శ్రీ హర్షిత అంబటిపూడి మరియూ చిరంజీవి సిద్దార్థ్ అయ్యగారి మున్నగు వారు పాల్గొన్నారు. ముకుంద్ జోస్యుల వయోలిన్ పైనా విశాల్ సెట్లూర్ మృదంగం పైనా సహకరించారు. మేఘన, శ్రీసంహిత, ఆశ్రిత మున్నగువారు ప్రసిద్ధ వాగ్గేయకారుల జీవిత విశేషాలను శ్రోతలతో పంచుకొని, వారి నానందింప జేసారు. శ్రీ అయ్యగారి సీతారామ్ వాగ్గేయకార వైభవం బృందాన్ని అభినందిస్తూ చేసిన సమగ్ర వివరణతో వాగ్గేయకార వైభవం గోష్టి గానం ముగిసినది.



తదుపరి, హ్యూస్టన్ నగర పరిసర ప్రాంతాల నుండి పలువురు సంగీత గురువులు వారి వారి శిష్యుల చేత అన్నమాచార్యులు, భద్రాచల రామదాసు, తూము నరసింహదాసు, త్యాగరాజ స్వామి, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్,నారాయణ తీర్థరు, పొన్నయ్య పిళ్ళై, ప్రయాగ రంగదాసు, మంగళం పల్లి బాలమురళీకృష్ణ, శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ మున్నగు ప్రసిద్ధ వాగ్గేయకారుల సంకీర్తనలు గానం చేయించారు. సంగీత గురువులు, శ్రీ అయ్య గారి సీతారామ్, శ్రీమతులు అపర్ణ గంటి, శార్వాణి ధూళిపాళ, జ్యోతి వేంకటేశం, రాజ రాజేశ్వరి భట్, శ్రీదేవి జోస్యుల, శ్రీ మహేష్ అయ్యర్, శ్రీ శంకర్ అయ్యర్, శ్రీ కొమాండూరి వెంకట కృష్ణ (ఇండియా) శ్రీ పార్థు నేమాని (ఇండియా), శ్రీ రాజశేఖర్ ఓరుగంటి (ఇండియా) మున్నగువారు. సుమారు 5 గంటలపాటు సాగిన ఈ సంకీర్తనా యజ్ఞంలో సంగీత విద్యార్థులందరూ మిక్కిలి భక్తి శ్రద్ధలతో వాగ్గేయకారులకు నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో శ్రావిక తిరునగరి, హంసిక అయాపిల్ల, కోవిద కొత్త, నియతి పండరి, మేధాశ్రీ భట్టర్, ప్రాణిక తిరునగరి, హర్షిత్ చిలుకూరి, ప్రియాంక చిలుకూరి, ఆదిత్య శ్రీనివాస్, కృతిక శ్రీనివాస్, మనస్వి జూటూరు, శ్రావ్య ఉప్పల, లాస్య ఉప్పల, సుశాంత్ మూట, సాత్విక్ సాయి ఉమ్మిటి, మీనాక్షి ఎర్రగుంట్ల, శ్రీవల్లి కోళపురం, షాలిని లక్ష్మి షాక్మొటై, సంశ్రిత

పొచెంపెద్ది, శ్రద్ధ వల్లూరి, సిరి రామినేని, అక్కి వర్రే, అలేఖ్య సాంబరాజు, భార్గవ బలిజేపల్లి, సహస్ర బలిజేపల్లి, అనిషా అయిలవరపు, శ్రావ్య వేదుల, అన్విభట్, రాణా వర్ఘూ, అభి కల్వకోట,శ్రీసంహిత పొన్నపల్లి, సిద్దార్థ్ అయ్యగారి, వెంకట్ భారతి, ఆషిత ఆనంద్ నిఖిల్ భరద్వాజ్, గాయత్రి ముళ్ళపూడి/ అవధానుల మున్నగు వారు వారి గాత్రం తోనూ, మను వర్ఘూ, గణేష్ వేణు, కార్తీక్ ముక్కవిల్లి వయోలిన్ తోనూ,దత్త ముళ్ళపూడి మృదంగంతోనూ శ్రోతలను అలరించారు.

అనంతరం వర్ధిష్ణ కళాకారులచే జరిగిన రెండు లఘు కచేరీలు శ్రోతల మన్ననలు పొందాయి. ముందుగా చి.భార్గవి చంద్రశేఖరన్ గానం ఎంతో ప్రతిభావంతంగా సాగి రసజ్ఞులను మంత్రముగ్ధుల్ని చేసింది. చి.సమర్థ్ అనంతుని సుమధుర గాత్రం శ్రోతలకు వీనుల విందు చేసింది. వీరిరువురికీ, చి. ప్రణవ్ ప్రవీణ్ (వయోలిన్) గోవింద్ రంగప్ప (మృదంగం) పై చాలా చక్కగా సహకరించారు.

తదనంతరం, మురళీధర్ లంక గారి శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఒక ప్రత్యేక ఆకర్షణ, వీక్ష విఠల, అలేఖ్యా సాంబరాజ్, శ్రీ సంహిత పొన్నపల్లి, మరియూ ఆకాంక్ష పంపంగౌడ్గారి బృందం ప్రదర్శించిన రామాయణ గాథ నృత్యం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.

పై కార్యక్రమాలన్నింటికీ, శ్రీయుతులు కాంత్ జోస్యుల, సీతారాం అయ్యగారి, శ్రీమతులు హిమ బిందు పొన్నపల్లి, శ్రీదేవి జోస్యుల మున్నగువారు వ్యాఖ్యాతలుగా నిర్వహించారు. శ్రీయుతులు వంగూరి చిట్టెంరాజు, వాడ్రేవు సత్యనారాయణ మూర్తి, రఘు చుండూరి, శ్రీనివాస్ ముళ్ళపూడి, శాస్త్రి చెరువు, సుధేష్ పిల్లుట్ల, కిరణ్ నెక్కంటి శ్రీమతులు యశోద, రమణ వాడ్రేవు, ఇందిరా చెరువు సంగీతోపాధ్యాయులను సముచితం గా సత్కరించి విద్యార్థులకు జ్ఞాపికలను బహూకరించారు.

తెలుగు సాంస్కృతిక సమితి కార్యవర్గ సభ్యులు, శ్రీయుతులు కిరణ్ నెక్కంటి (అధ్యక్షులు) శ్రీకాంత్ తిప్పారెడ్డి (సాహితీ సమన్వయ కర్త) శ్రీమతులు ఇందిరా చెరువు, ఆశాజ్యోతి దేవకి (సాంస్కృతిక కార్యదర్శి) మైథిలి చాగంటి గార్లు కార్యక్రమం ఆసాంతం వీక్షించి తమదైన రీతిలో వారి సహాయాన్నందించారు.

సాయంత్రం ఈ వాగ్గేయకారోత్సవం లో ప్రధాన కార్యక్రమమైన విద్వాన్ విశాల్ సాపురం బృందం చిత్రవీణ కచేరీ ఆద్యంతం రక్తిగా సాగి రసజ్ఞులను మైమరపించింది. ఈ కచేరీకి ముకుంద్ జోస్యుల (వయోలిన్) విశాల్ సెట్లూర్ (మృదంగం) ల సహకారం వన్నె చేకూర్చింది. కుమారి మీర అనంతుని తంబూరాపై సహకరించింది. విశాల్ తమ కచేరీ రంగనాథుడే అనే సౌరాష్ట్ర రాగ కీర్తనతో ప్రారంభించి, వరుసగా వాసుదేవాయని, వెంకట శైల విహార, సాధించెనే, రాజు వెడలె మున్నగు కీర్తనలు అద్భుతంగా వాయించారు. శ్రీమతి మైథిలి చాగంటి కళాకారులను సభకు పరిచయం చేయగా కాంత్ జోస్యుల వందన సమర్పణతో ఆనాటి సభ/కచేరి ముగిసింది.



సుమారు 10 గంటలపాటు జరిగిన ఈ ఉత్సవానికి ఎంతోమంది విజ్ఞులు తమ హార్థిక, ఆర్థిక సహాయాన్ని అందించారు. వారిలో శశాంక్ వల్లూరి, మురళీధర్ మరియు స్వర్ణ లంక, అరవింద్ మరియు సుధా సాంబరాజు, రవికాంత్ మరియు బిందు పొన్నపల్లి, సీతారామ్ మరియు ఉష అయ్యగారి, రమణ మరియు మహతి విట్టల, సుధేష్ మరియు సంగీత పిల్లుట్ల, సాయి మరియు లలిత రాచకొండ, శ్రీనివాస్ మరియు గీత కర్రా, చలపతి మరియు హేమ నళిని అక్కిరాజు, రోహిణి మరియు ప్రసాద్ ధూళిపాళ, రఘు మరియు శైలజ చుండూరు, సతీష్ కృష్ణమూర్తి మరియు జయశ్రీ, లక్ష్మీనారాయణ మరియు కృష్ణప్రియ కూరెళ్ళ, శిరీష మరియు భార్గవ మల్లాప్రగడ,చంద్ర మరియు అను గన్నవరపు వెంకట్ మరియు ప్రేమ చీటి,మహేంద్ర మరియు మాధవి, రవి తిమిరిశ, హరి రావు మున్నగు వారున్నారు, మరియూ రెండు వందలకు పైగా సంగీత రసజ్ఞులు ఈ కార్యక్రమాన్ని ఆస్వాదించారు.

## స్వరఝరి, విజయవాడ

ఆధ్వర్యంలో 30-4-2022 నాడు జనరంజకంగా జరిగిన గాత్రకచేరి. శ్రీ కొరిడే సుధీర్ శర్మ, ( ఆస్ట్రేలియా) – గాత్రం; శ్రీ పప్పుజ్ఞానదేవ్ (చెన్నై) – వయోలిన్; శ్రీసాయిరాఘవన్ (చెన్నై) మృదంగం; శ్రీసాయినాథ్ (చెన్నై) –ఘటం.




## స్వరఝరి, విజయవాడ

ఆధ్వర్యంలో 34 వ వార్షికోత్సవాలలో 5-3-2022న, సుమధురంగా వయోలిన్ సోలో కచేరీ చేసిన కుమారి చిన్మయి. శ్రీ హరిహరన్ – మృదంగం; శ్రీ హరిబాబు – ఘటం.



6.3.2022న స్వరఝరి 34వ వార్షికోత్సవంలో మూడు గంటలపాటు మనోహరంగా గాత్ర కచేరీ చేసిన శ్రీ ఆర్.సూర్యప్రకాష్ – చెన్నై. కుమారి చిన్మయి– వయోలిన్; శ్రీ హరిహరన్ – మృదంగం; శ్రీ హరిబాబు – ఘటం.



## సద్గురు సంగీత విద్వత్ గానసభ – వరంగల్

ఆధ్వర్యంలో కాకినాడ నెహ్రూబాలభవన్ విద్యార్థులు శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తిగారి ఆధ్వర్యంలో సమర్పించిన వాగ్గేయకారవైభవం 19-6-2022 నాడు జనరంజకంగా జరిగింది. బాలభవన్ సూపరింటెండెంట్ శ్రీమతి అయ్యగారి శారద కార్యక్రమ నిర్వహణ చేసారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు శ్రీ శ్రీరామచంద్రమూర్తిగారిని శ్రీమతి శారదను సత్కరించారు.







9.6.2022న కేరళ ఒట్టుపాలెం (పాల్ఘాట్) లో కె.పి.ఎస్ మీనన్ మెమోరియల్ అవార్డ్‌ను స్వీకరించిన ప్రముఖ గాత్ర సంగీత, వయోలిన్ విద్వాంసులు శ్రీ విష్ణుభట్ల శ్రీరామ చంద్రమూర్తి (కాకినాడ).



ప్రముఖ సంఘసేవకురాలు పలు సేవా సంస్థలలో అమేయమైన సేవలందించిన కాకినాడ సరస్వతీగానసభ ఉపాధ్యక్షురాలు అయిన లక్కరాజు శేషకుమారి జూన్ 3న పరమపదించారు. వారి సంస్మరణ సభ 8.6.2022న సభాధ్యక్షులు శ్రీ కె.వి.ఎస్. ఆంజనేయ మూర్తిగారి అధ్యక్షతన జరిగింది. వారి అభిమానులు, సంగీత సభా నిర్వాహకులు, సంగీత విద్వాంసులు వారికి ఘననివాళి అర్పించారు.

# గాయత్రీ మహిళా సంగీత సన్మండలి రజతోత్సవం - గుంటూరు

గాయత్రి మహిళా సంగీత సన్మండలి రజతోత్సవం స్థానిక బృందావన గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఘనంగా రెండు రోజులపాటు జరిగింది. 23-4-2022న డా॥ లావు మేఘన (నేత్ర వైద్యురాలు) జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్య అతిధిగా శ్రీ ఎస్.ఎ.వి. ప్రసాదరావు, జె.సి ట్రాన్స్‌పోర్ట్ ఎ.పి పాల్గొన్నారు. గౌరవ అతిధిగా శ్రీఎమ్.ఎస్. శ్రీనివాస్, కార్యదర్శి, విశాఖ మ్యూజిక్ అకాడమీ పాల్గొని ప్రసంగించారు. విశిష్ఠ అతిధిగా శ్రీ మాగంటి వేణుగోపాల్ ఎమ్.డి., విజయవాడ ప్రసంగించారు.

అనంతరం చెన్నై నుండి విచ్చేసిన ప్రియ సిస్టర్స్‌గా పేరు పొందిన షణ్ముఖ ప్రియ, హరిప్రియ గాత్ర కచేరీ వీనుల విందుగా జరిగింది. సంగీత అభిమానుల ప్రశంసలు అందుకున్నారు. తొలుత త్యాగరాజస్వామి వారి రచన నిన్నే భజనతో ప్రారంభించారు. అనంతరం, అన్నమయ్య రచించిన తరుణీవే అనే కీర్తన శంకరాభరణంలో, శ్యామశాస్త్రి రచన కామాక్షి, సరససామదాన కాపి నారాయణి రాగంలో త్యాగరాజు కీర్తన, ఖరహరప్రియలో రామ నీసమాన; చందమామరావే, లాలీ లాలనుచు, ఏ తీరుగనను మొదలైన అంశాలను రాగం, స్వరకల్పనలతో ఎంతో శ్రావ్యంగా, పాడి సభకులను ఆకట్టుకున్నారు. వీరికి వయోలిన్‌పై ఎమ్.ఎ.క్రిష్ణస్వామి, మృదంగంపై సాయిగిరిధర్, ఘటంపై మడిపాకం మురళి వాయిద్య సహకారం అందించారు. వీరు ముగ్గురు చెన్నైకి చెందినవారు.

రెండవరోజు 24-04-22 ఆదివారం నాదస్వరంతో సభ ప్రారంభం అయ్యింది. ఎమ్.వి.ఎస్.ఎల్ యశస్వి ప్రార్ధనాగీతం ఆలపించగా డా॥పి.విజయలలిత గాయత్రి సన్మండలి ఉపాధ్యక్షురాలు జ్యోతి ప్రజ్వలన చేసారు. సభకు సన్మండలి వ్యవస్థాపక అధ్యక్షులు డా.టి.సూర్యకాంతం అధ్యక్షత వహించారు. రజతోత్సవ సంచికను విశాఖ సాహితి అధ్యక్షురాలు ఆచార్య కోలవెన్ను మలయవాసిని ఆవిష్కరించారు. గౌరవ అతిధిగా బి.వి.రమణకుమార్ (కమీషనర్ రాష్ట్ర సమాచార శాఖ) పాల్గొన్నారు. విశిష్ట అతిధిగా శ్రీ మాదల రత్నగిరిబాబు పాల్గొని ప్రసంగించారు. ఆత్మీయ అతిధిగా పద్మశ్రీ డా॥ అన్నవరపు రామస్వామి సంస్థ గౌరవ అధ్యక్షులు 25సంవత్సరముల నుంచి సన్మండలి చేసిన కృషిని గురించి వివరించి ప్రశంసించారు. మరొక ముఖ్య అతిధిగా శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య పాల్గొన్నారు. సభలో వివిధ రంగాలలో లబ్ధ ప్రతిష్ఠులు కొందరు గౌరవ పురస్కారాలు అందుకున్నారు. సంగీతం - వేమూరి రామలక్ష్మి, సాహిత్యం - డా॥ మైలవరపు లలిత కుమారి, నృత్యం - శ్రీమతి వి.కృష్ణకుమారి,

హరికథ – శ్రీమతి బెండపూడి లక్ష్మీకుమారి, సామాజిక కుమారి పి.కమలకుమారి.

సభ అనంతరం 25 సం॥ల క్రితం ప్రారంభించిన సన్మండలి సభ్యులను సత్కరించారు. గాయత్రీ మహిళా సంగీతసన్మండలి కార్యవర్గం స్వర్ణపతకాన్ని కుమారి భమిడిపాటి శ్రీ లలితకు ప్రదానం చేసారు. అనంతరం కుమారి భమిడిపాటి శ్రీలలిత శాస్త్రీయ సంగీత కచేరి జరిగింది. మహాగణపతి – నాట రాగం, స్వాగతం కృష్ణా– మోహనరాగం; అరభిలో నగుమోము, శంభో శివశంభో, నెనరుంచినాను, రామచంద్రాయ అనే కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. సభలోని వారందరూ కరతాళధ్వనులతో అభినందించారు. వయోలిన్ పై చంద్రకాంత్ మృదంగంపై కామరాజు కార్తికేయ ఆదినారాయణ శర్మ సహకారం వాయిద్యం అందచేసారు.

ఈకార్యక్రమంలను లలిత సూపర్ స్పెషాలిటీస్ శ్రీ మాదల రత్నగిరిబాబు సమర్పించారు. రెండురోజుల కార్యక్రమాలని ప్రధానకార్యదర్శి శ్రీమతి ఎమ్.వై.శేషురాణి, కార్యదర్శి శ్రీమతి మంగ, జాయింట్ సెక్రటరీ శ్రీమతి పాటిబండ లలిత, ఇతర సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించి, జయప్రదం చేసారు.

**– శ్రీమతి మాధవ పెద్ది మీనాక్షి**




**గాయత్రి సంగీత సన్మండలి, గుంటూరు రజతోత్సవాలలో గానం చేసిన ప్రియా సోదరీమణులు షణ్ముఖప్రియ – హరిప్రియ**

# విశాఖ మ్యూజిక్ అకాడమీ మరియు నాదసుధాతరంగణి సంయుక్త ఆధ్వర్యంలో 'అన్నమాచార్య జయంతి' వేడుక

తెలుగుల తొలి వాగ్గేయకారుడు, తాళ్ళపాక అన్నమాచార్యుని జయంతి ఉత్సవం విశాఖపట్టణం 'విశాఖ మ్యూజిక్ అకాడమీ' 'నాదసుధాతరంగిణి' సంయుక్త ఆధ్వర్యంలో 16.5.22 సాయంత్రం స్థానిక కళాభారతి ఎ.సి.ఆడిటోరియంలో నిర్వహించబడింది.

ఈ సందర్భంగా చివుకుల వేంకట పేరిశాస్త్రి (చెన్నై) వారి గాత్ర సంగీత సభ యేర్పాటు చేయడం జరిగింది. వారికి వాయులీనంపై శ్రీ హెచ్.రాంచరణ్, మృదంగంపై శ్రీ ముళ్ళపూడి వేంకట రాజా లక్ష్మణరావు, మోర్సింగ్‌పై శ్రీ టి.చైతన్య సహకరించారు.




విశాఖ మ్యూజిక్ అకాడమీ ఛీఫ్ పాట్రన్ డా. సూరపనేని విజయకుమార్ కళాకారులకు ముందుగా పుష్పగుచ్చాలతో ఆహ్వాన సత్కారాలను అందచేసారు. సభానిర్వహణలో అకాడమీ కార్యదర్శి శ్రీ ఎమ్మెస్ శ్రీనివాస్, నాదసుధా తరంగిణి మేనేజింగ్ ట్రస్టీ డా. పేరాల బాలమురళి కృష్ణ పాలుపంచుకున్నారు.

నాటి గాత్రసభ రేవగుప్తి రాగంలో నాదయోగి నేదునూరి స్వరపరచిన "పురుషోత్తముడవీవు పురుషాథముడనేను" అనే అన్నమయ్య సంకీర్తనతో ప్రారంభించారు శ్రీ సి.వి.శాస్త్రి తరువాత "కరుణానిధిం గదాధరం" (కన్నడగౌళ), "ఎదుట నున్నాడు వీడు'' (భుజంగిణి), ''వందేహం జగద్వల్లభం'' (హంసధ్వని), ''నీ దాసుల బంధముల''(మలయమారుతం), ''పలుకు తేనెలతల్లి '' (అభేరి), ''నల్లనిమేని నగవు చూపులవాడు'' (పూర్వీకళ్యాణి), ''ఎక్కడి మానుషజన్మం" (బౌళి), చివరిగా "నానాటిబ్రతుకు నాటకము" (రేవతి) అంశాలు చోటుచేసుకున్నాయి.

పూర్వీకళ్యాణిలో నెఱవల్ స్వరకల్పన అంశాలు ఇటు సంప్రదాయ గంభీర్యాన్ని, అటు స్వరలాలిత్యాన్నీ, ప్రతిబింబిస్తూ, చక్కగాసాగాయి. హంసధ్వని, అభేరి రాగాల ప్రస్తారం శ్రోతలను ఆకట్టుకుంది.

శ్రీ హెచ్.రామ్‌చరణ్ వాయులీనంపైనా, శ్రీ ముళ్ళపూడి వేంకట రాజాలక్ష్మణరావు మృదంగం పైనా, శ్రీ టి.చైతన్య మోర్సింగ్ పైనా చక్కని చిక్కనౌ కమ్మని సహకారంతో కచేరి రసవత్తరంగా సాగింది.

డా. పేరాల సమీక్ష వందన సమర్పణలతో సభ సుసంపన్నం అయింది.

**– గానకళ ప్రత్యేక విలేఖరి**

## విశాఖ మ్యూజిక్ అకాడమీ మరియు నాదసుధాతరంగణి సంయుక్త ఆధ్వర్యంలో 'అన్నమాచార్య జయంతి' వేడుక

**SOUTH INDIAN CULTURAL ASSOCIATION (SICA),**
**Hyderabad**
**AND**
**VINJAMURI GOVINDARAJAN MEMORIAL TRUST,**
Hyderabad

cordially invite you to

# BOOK RELEASE FUNCTION
# &
# VINJAMURI MEMORIAL CONCERT

(Organized in memory of Musician and Musicologist Dr Vinjamuri Varadaraja Iyengar)

**On 23rd July 2022**
**at Ravindra Bharathi Main Hall at 6.00 PM**

## PROGRAMME:

### 6.00 – 6.30 PM: Release of Book
### "CARNATAKA SANGITA MARGADARSI - VINJAMURI VARADARAJA IYENGAR"

By
Sri **K. Padmanabhaiah** I.A.S. (Retd.)
Former Secretary – Ministry of Home Affairs – Govt. of India
Chairman, Court of Governors – ASCI, Hyderabad

### 6.30 PM - 9.00 PM: VOCAL CONCERT

Sri **O.S. TYAGARAJAN :** Carnatic Vocal
Sri **Kolanka Sai Kumar :** Violin
Sri **D.S.R. Murthy :** Mrudungam
Sri **K. Shyam Kumar :** Kanjira

**Dr. S. Chakravarthy I.A.S. (Retd.)**
**(President – SICA)**

**V Govindarajan Memorial Trust**

